VISALAANDHRA VIJAYAWADA Phone No. 376

★ 4 పేజీలు 6 నయాపైసలు రిజిష్టర్డు నెం A 193

### ఓబులదేవరపల్లివద్ద బస్సు ప్రమాదంలో మరణించినవారి సంఖ్య 39

అనంతపురం, ఫిబ్రవరి 26

నిన్న ఓబులదేవరపల్లి వద్ద జరిగిన బస్సు ప్రమాదంలో మరణించిన 39 మంది శవాలు బయటపడ్డాయి. వారిలో 13 గురు పురుషులు, 17 మంది స్త్రీలు, ముగ్గురు బాలురు, ఆరుగురు బాలికలు కలరు.

విశాలాంధ్ర

705902

సంపుటి 6 * విజయవాడ గురువారం ఫాల్గుణం 8-1879 [ఫిబ్రవరి 27-1958] * సంచిక 327

### బెంగుళూరు విమాన ఫ్యాక్టరీ కార్మికులపై పోలీసు కాల్పులు: లోక్‌సభలో వాయిదా తీర్మానం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26

బెంగుళూరులోని హిందూస్థాన్ విమానఫ్యాక్టరీ కార్మికులపై పోలీసు కాల్పులు జరిపి, లాకౌట్ ప్రకటించిన ఉదంతంపై నేడు లోక్‌సభలో శ్రీ యస్. యమ్. బెనర్జీ ప్రతిపాదించిన వాయిదాతీర్మానాన్ని చర్చకు తీసుకోవడానికి స్పీకర్ నిరాకరించారు.

# మొట్టమొదటిసారిగా ఆంధ్రలో మిగులుబడ్జెట్ ప్రతిపాదన

## ఉపాధ్యాయుల జీతభత్యాలు పెంచడానికి 34 లక్షల రూపాయల కేటాయింపు

## 1958-59 సంవత్సరానికి రెవిన్యూపద్దులో ఆదాయం 6366 లక్షలు, వ్యయం 6287 లక్షలు

(విశాలాంధ్ర విలేఖరి) హైదరాబాదు, ఫిబ్రవరి 26

చాలాకాలం తర్వాత ఆర్థిక మంత్రి గోపాలరెడ్డిగారు మిగులు బడ్జెటును ఆంధ్ర శాసనసభలో ప్రతిపాదించారు. నేడాయన ప్రతిపాదించిన బడ్జెటులో అదనంగా కొత్తపన్నుల ప్రతిపాదనలు లేకపోవడం మరొక విశేషం.

ప్రాథమిక, సెకండరీ ఉపాధ్యాయుల జీతభత్యాలు పెంచడంకోసం 34 లక్షల రూపాయలను కేటాయించామని శ్రీ గోపాలరెడ్డిగారు వెల్లడించారు.

ఆంధ్రప్రాంతంలో గల ప్రభుత్వోద్యోగులకు కూడా ప్రభుత్వ భీమా పథకం సౌకర్యాన్ని కల్పిస్తామని ఆయన చెప్పారు.

నూతన సంవత్సరానికి నేడు శాసనసభలో బడ్జెటును ప్రతిపాదిస్తూ, ఆర్థికమంత్రి శ్రీ గోపాలరెడ్డిగారు ఇలా చెప్పారు.

నిరుడు నేను మీకు బడ్జెటును ప్రతిపాదించినప్పుడు పరిస్థితి అంత బాగుగా లేనట్లు వివరించాను. కాని ఈసారి మాత్రం మిగులు బడ్జెటును ప్రతిపాదిస్తున్నందుకు చాలా సంతోషం పొందుతున్నాను.

ఆంధ్రరాష్ట్రం ఏర్పడినప్పటినుంచీ లోటుతప్ప మరొకటి ఎరగం. కాని ఈ సంవత్సరం మొదటిసారిగా మిగులు బడ్జెటును వెల్లడిస్తూ ఆశాభావంతో చేసే ప్రసంగాన్ని మీరు వింటున్నారు. మన పన్నులవిధానం మొత్తంమీద చాల చిక్కగావుంది. పన్నుల విచారణసంఘంవారి ప్రతిపాదనలు మనఇబ్బందులను తొలగించడానికి చాలా తోడ్పడ్డాయి. కాగా మనకున్న సాధనాల పరిస్థితి మాత్రం ఇంకా అధ్వాన్నంగానే వుంది. రుణాలద్వారా కాని చిన్న మొత్తాల పొదుపుద్వారా కాని మనం కావలసిన ధనాన్ని సేకరిస్తే మన ఆందోళన తగ్గగలదు. ప్రణాళికా కాలంలోని ఆఖరి రెండు సంవత్సరాల్లోను మనకు మరికొన్ని ఎక్కువ చిక్కులు కలగవచ్చును. అందుకని మన ఈ తాత్కాలిక మిగులు చూసి ఉపేక్షాభావంతో వుండరాదని గౌరవసభ్యులను హెచ్చరిస్తున్నాను. అనతికాలంలోనే అవసరంగాగల మొత్తాలను సేకరించడానికి తగిన జాగరూకతతో కూడా వుండాలని హెచ్చరిస్తున్నాను.

### ఆదాయం

1958-59 సంవత్సరపు బడ్జెటు అంచనాల ప్రకారం భూమ్యాదాయం 63 కోట్ల 66 లక్షలు. రెవెన్యూ పద్దుక్రింద వ్యయం 62 కోట్ల 87 లక్షలు. 1957-58 నాటి రివైజ్డ్ అంచనాల ప్రకారం రెవెన్యూ ఆదాయం 61 కోట్ల 8 లక్షలు. ఖర్చు 58 కోట్ల 96 లక్షలూ వుంది. 1958-59 సంవత్సరాల్లో రెవెన్యూ పద్దుక్రింద మిగులు 79 లక్షలు. దీనితో పోల్చి చూస్తే 1957-58 బడ్జెటు అంచనాలలో లోటు 5 కోట్ల 48 లక్షలూ, రివైజ్డ్ అంచనాలలో మిగులు 3 కోట్ల 12 లక్షలూ వుంది. 1957-58 లో 3 కోట్ల 12 లక్షలు మిగులు ఏర్పడ్డానికి రాజ్యాంగసూత్రం 275 (1) ప్రకారం కేంద్రం ఇచ్చిన సహాయం మున్నగునవి కారణాలు.

ఫైనాన్సు కమిషన్‌వారు చేసిన సిఫార్సుల ప్రకారం ఆంధ్ర రెవెన్యూ పద్దుకు అదనంగా వచ్చే మొత్తం ఈ ఏడాది 6 కోట్ల 27 లక్షలు. బడ్జెటు సంవత్సరంలో 7 కోట్ల 5 లక్షలు వుంటుంది.

### ఖర్చు

1958-59 సంవత్సరంలో 21 కోట్ల 29లక్షలు ఇరిగేషన్, విద్యుచ్ఛక్తి, రోడ్లు, భవనాలుమున్నగు పథకాలపై వెచ్చిస్తాం.

ఆఖర్చు వివరాలివి:

| | లక్షలు |
|---|---|
| నాగార్జునసాగర ప్రాజెక్టు | 700 |
| రాజోలిబండ పథకం | 36.06 |
| కృష్ణారోడ్డు బ్రిడ్జి రెగ్యులేటరు | 23.07 |
| భైరవాని తిప్ప | 28.67 |
| తుంగభద్ర దిగువ కాల్వ | 55.70 |
| తుంగభద్ర ఎగువ కాల్వ | 40.00 |
| కె. సి. కెనాలు | 26.03 |
| మాచ్‌ఖండ్ జలవిద్యుత్పథకం | 173.94 |
| తుంగభద్ర జలవిద్యుత్ పథకం | 81.64 |
| తెలంగాణా జలవిద్యుత్ పథకాలు | 55.12 |

మునిసిపాలిటీలలో మురుగుకాల్వ, మంచినీటి పథకాలకు, రైతులకు చిన్నపరిశ్రమల వారికి, సహకార సంఘాలకు అప్పులివ్వడంకోసం 6 కోట్ల 92 లక్షలు కేటాయించాం.

ద్వితీయ ప్రణాళిక పథకాలకు బడ్జెట్ సంవత్సరంలో ఖర్చుపెట్టవలసిన 31కోట్లకుగాను ఇప్పుడు బడ్జెటులో 30 కోట్ల 2 లక్షలు కేటాయించాం. ఈధనాన్ని స్థూలంగా ఇలాసద్దుతాం.

రెవిన్యూపద్దుక్రింద 9.31 కోట్లు
పెట్టుబడి పద్దు 18.42 ,,
అప్పులు, అడ్వాన్సులు 2.29 ,,

బడ్జెటు సంవత్సరంలో ప్రణాళికా నిర్వహణకు కేంద్రంనుంచి వచ్చే సహాయం దాదాపు 18 కోట్లుంటుంది. మిగతా 12 కోట్ల 2 లక్షల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం సేకరించవలసి వుంటుంది. ఆ సేకరణ పద్ధతి ఇది:

రెవిన్యూ మిగులు
(ప్రణాళిక ఖర్చుకాక) 6.69 కోట్లు
కేంద్రరాష్ట్రాలు విధించే
అదనపు పన్నులు 1.00 ,,
రుణాలు, చిన్న మొత్తాల
పొదుపు 6.00 ,,
తక్కావీ వసూలు వగైరా 4.45 ,,
కేంద్రం అప్పు చెల్లుబడి 6.22 ,,

ఈ చెల్లుబడిని తీసివేయగా మిగిలే మొత్తం 12 కోట్ల 2 లక్షలు.

తెలంగాణాలో లోగడ వున్న రుణంతో సహా మొత్తం ఆంధ్రప్రదేశ్ ప్రజారుణం 1957 మార్చి మాసాంతానికి 129 కోట్లుండి. ఇది 1958 మార్చి మాసాంతానికి 144 కోట్ల 46 లక్షలు, 1959 మార్చి మాసాంతానికి 162 కోట్ల 7 లక్షలకు పెరగవచ్చును. ఈ ప్రజారుణానికి ఇచ్చే వడ్డీకూడా సహజంగా పెరుగుతోంది. 1957-58 లో ఇది 5 కోట్ల 45 లక్షలుండగా 1958-59 నాటికి ఇది 6 కోట్ల 66 లక్షలకు పెరుగుతుంది.

### వసూళ్లు

చిన్న మొత్తాల పొదుపు వసూళ్ళు అనుకొన్నంతటి పక్కాగా సాగడంలేదు. అందుకని ఈ బడ్జెటు సంవత్సరంలో ప్రజారుణాన్ని సేకరించక తప్పదు. ప్రజారుణం, చిన్న మొత్తాల పొదుపు ధనంలో రాష్ట్రీవాటా మొత్తం 6 కోట్ల రూపాయలను ఆదాయం పద్దుకు జమకట్టాం. ఆంధ్ర తెలంగాణాల్లో భూమి శిస్తు, ఎక్సయిజు, తక్కావీ బకాయీలు మొత్తం 10 కోట్లకుపైగా వున్నాయి. 1958-59 లో ఇందులో కనీసం రెండు కోట్లనైనా వసూలు చేయాలని ప్రభుత్వం సంకల్పించింది.

భూమి తనఖా బ్యాంకులు ఏపెక్సు సహకార బ్యాంకులద్వారా గ్రామీణ పరపతిని కలిగించాలని చూస్తున్నాం. ఈ పరపతి ఈ బడ్జెట్ సంవత్సరంలో 17 కోట్ల 23 లక్షల వరకు వుంటుంది.

ఆంధ్రప్రాంతంలోని ప్రభుత్వోద్యోగులకు ప్రభుత్వ జీవత భీమా పథకాన్ని వర్తింపచేయడానికి నిర్ణయించాం.

సచివాలయంలో పొదుపు అవలంబించే మార్గాలను సూచించడం కోసం ప్రభుత్వం నియమించిన కమిటీ సిఫార్సులను ఆమోదించాం. దీనివల్ల ఏటా 10 లక్షలు పొదుపు కాగలదని ఆశిస్తున్నాం.

ఒకే ప్రాంతంలో ఒకే రకం పని చేస్తూ ఒకే రకం యోగ్యతలుగల రాష్ట్ర కేంద్ర ప్రభుత్వోద్యోగుల జీతాల స్కేళ్లలో గల వ్యత్యాసాన్ని తగ్గించవలసిన అవసరంవుంది అని ఆయన అన్నారు.

నెలకు రెండువందలలోపు జీతగాళ్లకు ఆరురూపాయల అదనపు కరువుభత్యం, కరణాలు మునసబులకిచ్చే అదనపు భత్యాలను ఆయన ప్రస్తావించారు. ఇదికాక ప్రాథమిక, హైస్కూలు పంతుళ్ళ జీతభత్యాల పెంపుదలకోసం 34 లక్షలు కేటాయించామని చెప్పారు.

"ఇంతటితో విరమిస్తున్నాను. అయితే ఎవరూ ఉపేక్షాభావం చూపడానికి వీల్లేదు. అనేక ముఖాలలో మనం క్రమాభివృద్ధిని సాధిస్తున్నాం. ఈ ఏడాది బడ్జెటులో కాని ద్వితీయ పంచవర్ష ప్రణాళికా కాలంలో కాని అవకాశం కల్పించని కోర్కెలు ఎన్నో వున్నాయి. జీతభత్యాలు ఎక్కువ కావాలని కొందరు కోరుతున్నారు. దానికిఎంతో ఖర్చు అవసరం. అందుకని కొత్తవనరులను మనం వెతుకుతూనే వుండాలి. ఎక్కువ సంపాదించి ప్రజాక్షేమానికి వెచ్చించాలి. మన పెట్టుబడి వ్యయంకోసం పెద్ద మొత్తాలను అప్పుచేయవలసి వుంటుంది కూడా.

మన చిన్న మొత్తాల పొదుపు ఉద్యమం నిర్విరామంగా కొనసాగుతూవుండాలి. మన ద్వితీయ ప్రణాళిక రెండవ స్పుత్నిక్‌లాంటిది. దాని తర్వాత మరెన్నో దాన్ని అనుసరించవలసివుంది. 1958-59 లో ప్రణాళికా వ్యయం కోసం మేం 12 కోట్లు సద్దుతాం అని ప్రణాళికా సంఘానికి ఇచ్చిన మాటను నిలుపుకోవాలి.

రిజర్వు బ్యాంకులో మనకున్న రుణాన్ని బాగా తగ్గించుకోవలసి వుంటుంది. దీనికి నాలుగు కాలం వడ్డీ కట్టుకొంటూ కూర్చోవడం అంత మంచిదికాదు. మన నిల్వలను అమ్మి అయినాసరే ఈ రుణాన్ని తొలగించుకోవాలి. మన నిల్వలమీద వచ్చే దామాషాఆదాయం రెండుంముప్పావు శాతం.

ఆంధ్రరాష్ట్రం 1954-55 లో 19 కోట్ల 82 లక్షల రివెన్యూ లోటుతో ప్రారంభమైంది. ఈ ఏడాది ఆంధ్రప్రదేశ్‌లో 63 కోట్ల 66 లక్షల ఆదాయాన్ని మనం ఆశిస్తున్నాం. దీనిలో తెలంగాణా ఆదాయంకూడా కలిసివుందనుకోండి. మన గనులు పరిశ్రమలు పెంపొందిన నాడు ఇక మూడు నాలుగేళ్లలో మనం నూరుకోట్ల బడ్జెటును ఆశించడంలో దోషం లేదు అని శ్రీ గోపాలరెడ్డిగారన్నారు.

## టి. టి. కె. పాత్ర రుజువుచేయడానికి అధికారుల సంసిద్ధత

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24

ముంద్రా కుంభకోణం విషయం మాజీ ఆర్థికమంత్రి శ్రీ కృష్ణమాచారికి అంతగా తెలియదని మంత్రులు చేస్తున్న వాదనలు త్రిప్పికొట్టాలనీ, ఆయనకుగల ప్రధాన పాత్రను బయటపెట్టాలనీ ఆ కుంభకోణంతో సంబంధంగల ముఖ్యఆఫీసర్లంతా నిర్ణయించుకొన్నట్లు తెలుస్తోంది.

ఆర్థికమంత్రిత్వ శాఖ మాజీ ప్రధమ కార్యదర్శి శ్రీ హెచ్. యమ్. పటేల్ ఈ సందర్భంలోనే మొన్న గురువారంనాడు రాత్రి ప్రధానమంత్రిని కలుసుకొని మాట్లాడారు.

ముంద్రా కుంభకోణాన్ని గురించి ఇంకా దర్యాప్తు జరిపించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ఈ దర్యాప్తునుండి కృష్ణమాచారిని మినహాయించడంపట్ల శ్రీ పటేల్ తన నిరసనను తెలిపారు.

ఈపరిస్థితులలో కృష్ణమాచారిని ఈ కుంభకోణం నుండి మినహాయించడం ప్రభుత్వానికి సాధ్యం కాకపోవచ్చునని అభిజ్ఞవర్గాల్లో భావించుతున్నారు. (ఐ. పి. ఎ.)

## ప్రయాణీకులకు ఫిలిం చిత్రాలు

### తూర్పు రైల్వేవారి ఏర్పాటు

కలకత్తా, ఫిబ్రవరి 24

రైల్వే స్టేషన్లలో రైళ్ళకోసం వేచివుండే ప్రయాణీకులకు ఫిలిం చిత్రాలను చూపెట్టడానికి తూర్పు రైల్వేవారు ఏర్పాటు చేస్తున్నట్లు నేడిక్కడ ప్రకటించబడింది.

రైళ్లకోసం వేచివుండే వారికి విసుగును తగ్గించే ఉద్దేశ్యంతో ఈఏర్పాటు చేయబడుతున్నది. ద్వితీయ పంచవర్షప్రణాళిక, వివిధ రాష్ట్రాల్లోని యాత్రాకేంద్రాలు, టిక్కెట్లు లేకుండా ప్రయాణం చేయడంవలన జరిగేహానీ, మొదలుగాగల సమస్యలపై తీయబడిన ఫిలించిత్రాలను రైల్వే స్టేషన్లలో ప్రదర్శించుతారు.

## శిఖరాగ్ర సమావేశం

### జపాను సమర్థన

టోకియో, ఫిబ్రవరి 25

అణ్వాయుధాల నిషేధానికి శిఖరాగ్ర సమావేశానికీ జపాన్ సుముఖంగావుందని నేటి రాత్రి జపాన్ విదేశాంగశాఖవారు ప్రకటించారు.

## సుమత్రా తిరుగుబాటు నాయకుల పలాయనం

### ఇండొనేషియా ప్రభుత్వ ప్రకటన

సింగపూర్, ఫిబ్రవరి 25

సుమత్రా తిరుగుబాటు నాయకులు అక్కడి ప్రజలను, సైనికులను వారి గతికి విడిచిపెట్టి విదేశాలకు పలాయనం చిత్తగించారని జకార్తా రేడియో నేడు ప్రకటించింది.

సుమాత్రలో పెట్టుబడులను కలిగివున్న విదేశరాజ్యాలలో వీరు తలదాచుకొంటారని జకార్తా రేడియో తెల్పింది.

నిన్న సుమాత్రాకు ఆగ్నేయంగా ఒక పడవను ప్రభుత్వ విమానాలు ముంచెత్తాయి. కాల్టెక్స్ నూనెగనుల ప్రాంతమైన పాకన్‌బహ్రూకీ పడాంగ్‌కీ రాకపోకలు ఇందువల్ల స్తంభించాయి.

జకార్తా ప్రభుత్వం ఈ నూనెగనుల ప్రాంతాన్ని స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నిస్తుందని తిరుగుబాటుదార్లు అనుకొంటున్నారు.

తిరుగుబాటు కేంద్రాలపై బాంబులు వేసినప్పుడు ఎవరికీ ప్రాణనష్టం జరగకుండా వుండేట్లు చూడ్డం తమ అభిమతం అని ఇండొనేషియా ప్రభుత్వం ఒక ప్రకటన చేసింది. పడాంగ్, బుక్కిట్టింగీ, లెబనాడో రేడియో స్టేషన్లను అసంకతంగా ఉపయోగిస్తున్నారు కాబట్టి వాటిమీద బాంబులు వేయవలసివచ్చిందని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

పడాంగ్ బుక్కిట్టింగీ రేడియో స్టేషన్లు పూర్తిగా ధ్వంసమయ్యాయని ఇండొనేషియా వార్తాసంస్థ పేర్కొంది.

### విదేశ సహాయానికి తిరుగుబాటుదార్ల అభ్యర్థన

తిరుగుబాటు ప్రభుత్వ ప్రధాని జఫ్రుద్దీన్ ప్రవీరనగర్ సహాయం చేయవలసిందనికొన్ని విదేశాలకువర్తమానం పంపినట్లు తెలిసిందని ఇండొనేషియా ప్రభుత్వం ప్రకటించింది. ఈ విదేశీ ప్రభుత్వాల్ని గురించి కాని, విదేశీయుల్ని గురించి కాని ఆ ప్రకటనలో వివరాలివ్వలేదు.

విదేశాలనుంచి కొత్త రేడియో ట్రాన్స్‌మిటర్ తెప్పించుకోవాలని జఫ్రుద్దీన్ ప్రయత్నిస్తున్నట్లు కూడా ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

### తిరుగుబాటుదార్ల బెదిరింపు

కేంద్ర ప్రభుత్వం సుమత్రాపై జరుపుతున్న విమానదాడులకు ప్రతిక్రియగా తాము కూడా ఎదురుదాడులు సాగిస్తామని తిరుగుబాటుదార్ల నాయకులొకరు వెల్లడించారు.

జపానులో కాని హాంకాంగ్‌లో కాని విమానాలు కొనడానికి తాము ప్రయత్నిస్తున్నామన్నారు.

## కేరళలో వరకట్న నిషేధ బిల్లు

తిరువనంతపురం, ఫిబ్రవరి 25

వరకట్నాలను నిషేధించే బిల్లును కేరళ ప్రభుత్వం నేడు గెజెట్‌లో ప్రకటించింది. ప్రస్తుత శాసనసభ సమావేశంలోనే బిల్లును ప్రవేశపెడతారు.

## కలకత్తా సమీపంలో మరో రైలు ప్రమాదం

### రెండురైళ్లు ఢీకొన్నందున అయిదుగురి మరణం, 44 గురికి గాయాలు

కలకత్తా, ఫిబ్రవరి 26

కలకత్తాకు ఆగ్నేయంగా పదిమైళ్ల దూరంలో నున్న సోనాపూర్ వద్ద స్థానిక రైళ్లు రెండు ఢీకొనడంవలన అయిదుగురు చనిపోయారు. 44 గురు గాయపడ్డారు,

ఈ దుస్సంఘటన ఈవేళ ఉదయం 5-30 గంటలకు జరిగింది.

గాయపడిన వారిలో 27 గురిని రైల్వే ఆసుపత్రిలో చేర్చారు. వీరిలో ఏడుగురికి ప్రమాదకరంగా వుంది.

ఒక రైలుస్టేషన్‌ను విడిచి వెడుతుండగా మరొక రైలుస్టేషన్‌లో ప్రవేశించడంతో ఈదుస్సంఘటన జరిగిందని తూర్పురైల్వే మండలం అధికారులు తెలుపుతున్నారు.

## లంకకు అమెరికా బహుమతి

కొలంబో, ఫిబ్రవరి 25

లంక వరదబాధితుల సహాయార్థం అమెరికా కోటిన్నర రూపాయల విలువగల ఆహారధాన్యాలను విరాళంగా పంపింది. ఇందులో 3 కోట్ల 30 లక్షల శేర్ల బియ్యం, మిగిలింది గోధుమపిండినీ వుంటుంది.

## మరో అమెరికా వైఫల్యం

కేప్ కార్నివాల్, ఫిబ్రవరి 25

అమెరికా విమానదళంవారు నేడిక్కడ ప్రయోగించిన [illegible] రాకెట్ కొద్దిదూరం వెళ్ళి ప్రేలిపోయింది.

## ఐక్యఅరబ్బు రిపబ్లిక్ అమెరికా గుర్తింపు

వాషింగ్టన్, ఫిబ్రవరి 25

ఈజిప్ట్ సిరియాలు కలిసి ఏర్పడిన ఐక్యఅరబ్బు రిపబ్లిక్‌ను అమెరికా ప్రభుత్వం నేడు గుర్తించింది. ఆ రిపబ్లిక్‌కి అమెరికా ప్రభుత్వం తన శుభాకాంక్షలను అందజేసిందని విదేశాంగ శాఖ నేటొక అధికార ప్రకటనలో తెలిపింది.

జపాను, లంక, ఇండొనేషియా, ఉత్తర వియత్నాం ప్రభుత్వాలు ఐక్య అరబ్ రిపబ్లిక్‌ను గుర్తించాయని ఆయా దేశాల రాజధానుల్లో అధికార ప్రకటనలు వెలువడ్డాయి.

## కాంగ్రెసు ఎన్నికల కోసం ప్రభుత్వ బ్యాలెట్ పెట్టెలు దుర్వినియోగం: కాశీలో జరిగినట్లు మంత్రి అంగీకారం

లక్నో, ఫిబ్రవరి 25

కాశీలో కాంగ్రెసుపార్టీకి సంబంధించిన ఎన్నికలు జరుపుకోవడానికి గత డిసెంబరులో ప్రభుత్వం ఒక వంద బ్యాలెట్ పెట్టెలను ఇచ్చినమాట నిజమేనని నేడు ఉత్తరప్రదేశ్ శాసనసభలో న్యాయశాఖా మంత్రి ఆలీ జహీర్ అంగీకరించారు.

శ్రీ భువన భూషణశర్మ అడిగిన ప్రశ్నకు సమాధానంగా మంత్రి జహీర్ ఈ విషయం తెలిపారు.

ఒక ఉప ప్రశ్నకు జవాబు చెపుతూ ఆపెట్టెలను కాశీపంపించి తిరిగి తెప్పించడానికి అయిన ఖర్చును ఎన్నికల డిపార్టుమెంటు భరించలేదన్నారు.

హోంమంత్రి పండిత కమలపతి త్రిపాఠి మాట్లాడుతూ బ్యాలెట్ పెట్టెలు కావాలని కాశీ కాంగ్రెసు కమిటీ అభ్యర్థించగా వాటిని యివ్వడానికి అనుమతి నిచ్చినది తానేనని ఒప్పుకున్నారు. ఈ తప్పుకు తనదే బాధ్యత అని? ఇందుకు విచారాన్ని తెలుపుతున్నానని ఆయనన్నారు.

## కుటుంబ ప్రాతిపదికపై భూమికి గరిష్ట పరిమితి నిర్ణయించాలి

### పదివేలమందికిపైగా ప్రజలు హాజరైన గుడివాడసభలో శ్రీసుందరయ్యగారి విజ్ఞప్తి

గుడివాడ, ఫిబ్రవరి 23

భూసంస్కరణల ఫలితాలు ప్రజలు పొందాలంటే గరిష్ఠ పరిమితి నిర్ణయం కుటుంబం ప్రాతిపదికపై జరగాలని, వ్యక్తి ప్రాతిపదికపై జరగరాదని ఆంధ్ర కమ్యూనిస్టు నాయకులు శ్రీ సుందరయ్యగారు ఇక్కడ పదివేలమంది హాజరైన బహిరంగసభలో ప్రసంగిస్తూ అన్నారు.

సభకు "విశాలాంధ్ర" పత్రికా సంపాదకులు శ్రీ కాట్రగడ్డ రాజగోపాలరావుగారు అధ్యక్షత వహించారు. హైస్కూలు సెంటరులో రాత్రి 9 గంటలకు జరిగిన ఈసభకు ఎన్నడూ రానంతమంది స్త్రీలుకూడా హాజరైనారు.

సభాధ్యక్షులు శ్రీ రాజగోపాలరావుగారు భారత జాతీయ నాయకులూ, కేంద్ర మంత్రీ అయిన మౌలానా అబుల్‌కలాం ఆజాద్ మరణానికి సానుభూతి తీర్మానం ప్రవేశపెట్టి ఆయనకు జోహార్లు అర్పించారు.

అనంతరం శ్రీ సుందరయ్యగారు జాతీయ అంతర్జాతీయ పరిస్థితులను వివరించారు. రెండవ పంచవర్ష ప్రణాళికను గురించి మాట్లాడుతూ ఇలా అన్నారు:

"రెండవ పంచవర్ష ప్రణాళికా కాలంలో పరిశ్రమలకు ఎక్కువ మొత్తం కేటాయించారు. ఆ డబ్బు అంతా వాటికి ఉపయోగపడి, దేశం అభివృద్ధి అయితే అందరికీ సంతోషమే. వాస్తవానికి యిది చాలదు; యింకా ఎక్కువ చేయాలి; చేయటానికి అవకాశాలుగూడావున్నాయని కమ్యూనిస్టులం అంటున్నాము. కళా వెంకట్రావుగారు యీ మధ్య మాట్లాడుతూ రోజుకు ఒకగ్రామంలో ఆంధ్రదేశంలో ఎలక్ట్రిసిటీ పెడ్తున్నామన్నారు. మరి ఆంధ్రదేశంలో 24 వేల గ్రామాలు వున్నాయి. మంత్రిగారి లెక్కల ప్రకారం ఆంధ్రదేశం అంతా కరెంటురావాలంటే 80 సంవత్సరాలు పడుతుంది. అంతవరకు ఆగితే అది అభివృద్ధి కార్యక్రమం అవుతుందా?

అలాగే చిత్తరంజన్ రైలు ఫ్యాక్టరీ, విశాఖపట్నం షిప్‌యార్డ్ వగైరాలు వున్నాయి. వీటిలో నూటికి 40 వంతులు విదేశాల నుండి విడిభాగాలు తెప్పించుకోవలసిన అవసరం యీనాటికీ వుంది. ఇది అభివృద్ధికి గీటురాయా! చైనాలో యిప్పటికే అన్ని భాగాలూ వారు స్వంతంగా తయారు చేసుకుంటున్నారు గదా! ఇది ఎలా సాధ్యమయింది. మరి మనకు ఎందుకు వీలుపడదు? దీనికిమూలం మనం ప్రతిదానికి బ్రిటన్ అమెరికాల మీద ఆధారపడటం వల్లనే."

### కుటుంబ ప్రాతిపదికపైనే భూమికి సీలింగు

తర్వాత భూసంస్కరణలు గూర్చి మాట్లాడుతూ శ్రీ సుందరయ్యగారు యిలా అన్నారు.

"పంచవర్ష ప్రణాళిక విజయం పొందాలంటె భూసంస్కరణలు వెంటనే రావాలి. కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ ఢేబరు, ప్లానింగు కమిషన్, ఆంధ్ర కాంగ్రెసు నాయకులు భూసంస్కరణల అవసరాన్ని గురించి ప్రకటనలు చేస్తున్నారు; తీర్మానాలు చేస్తున్నారు. మరి ప్రకటనలకు చేతలకు పొత్తులేకుండా పోతోంది. మేము 1955 ఎన్నికల్లో భూసంస్కరణలు కావాలని, కుటుంబానికి 20 ఎకరాలు మాగాణీ వుండాలని చెప్పితే ఆనాడు కాంగ్రెసు నాయకులు మాకు వ్యతిరేకంగా ప్రచారం చేశారు. పేదవారినికూడ రెచ్చగొట్టి మమ్ములను ఓడించారు.

(మిగతా 2వ పేజీలో)

హేవిళంబి నామ సంవత్సర
చాంద్రమాన ఫాల్గుణమాసం
అష్టమి 14-45
రోహిణి 19-08

విశాలాంధ్ర

గురువారం 27-2-58
ఫాల్గుణం 8-1879

# అబ్దుల్లా అనుచరుల అఘాయిత్యాలు

భారతదేశంలో కాశ్మీర్ విలీనీకరణను ఆక్షేపిస్తూ, షేక్ అబ్దుల్లా చేస్తున్న విద్వేషపూరిత ప్రసంగాల ఫలితంగా కాశ్మీర్‌లో తీవ్ర దుష్ఫలితాలు ఏర్పడుతున్నాయి. అబ్దుల్లా అనుచరులు కాశ్మీర్ జాతీయ మహాసభ కార్యకర్తలపైన ఒక పథకం ప్రకారం దౌర్జన్యచర్యలు జరుపుతున్నారు.

ఫిబ్రవరి 21 వ తేదీన వీరు జాతీయ మహాసభ కార్యకర్తలపై దాడిచేసి 15 మందిని గాయపరిచారు. గాయపడినవారిలో గులాం మొహిదీన్ బందే అను కార్యకర్త పొత్తికడుపులోతగిలిన బాకుపోట్ల ఫలితంగా మరణించాడు. దుండగులు నాలుగు కార్లను ధ్వంసం చేశారు.

ఈ దాడిలో పాల్గొన్న దుండగులు అంతకు ముందుగానే, షేక్ అబ్దుల్లా ప్రసంగించిన ఒక సభకు హాజరై తిరిగి వెళ్ళుతూ ఈ దౌర్జన్యానికి తలపడ్డారని కూడా తెలుస్తున్నది. అబ్దుల్లా చేస్తున్న భారత విద్వేష ప్రచారం ఎట్టి దారుణ ఫలితాలకు దారితీస్తున్నదో ఈ ఘటన తెలియజేయగలదు.

వీరమరణం పొందిన శ్రీ బందే, ఆఖరి ఘడియలలో చేసిన ప్రకటన ప్రతి భారతీయుణ్ణి, ప్రతి కాశ్మీర్ పౌరుడిని ఉత్తేజితుని చేయగలదు. తన మరణానికి విచారించవద్దని "భారత-కాశ్మీర్‌ల ఐక్యతకు, జాతిమత విచక్షణలేని సర్వమానవ సమానత్వం కొరకు తాను బలి అవుతున్నా"నని బందే తెలియజేశారు. భారతదేశంతో కాశ్మీర్ విలీనీకరణకు ఎట్టి భంగం వాటిల్లనివ్వరాదని, తోటి సహచరులకు సందేశం ఇచ్చి శ్రీ బందే కన్నుమూశారు. ఇట్టి వీరుల మహత్తర త్యాగ ఫలితంగా దృఢతర మవుతున్న భారత-కాశ్మీర్ ఐక్యతను, అబ్దుల్లా విచ్ఛిన్నకర చర్యలు భగ్నం చేయలేవు.

శ్రీ బందే హత్య కాశ్మీర్ అంతటా తీవ్ర సంచలనం కలిగించింది. కాశ్మీర్ శాసనసభలో శ్రీ అబ్దుల్ గనిగోని ప్రసంగిస్తూ, షేక్ అబ్దుల్లా ప్రసంగాలు ప్రజా శ్రేయస్సుకు భంగకరంగా ఉన్నాయని, ఇట్టి విద్వేష ప్రచారాన్ని నిషేధించాలని విజ్ఞప్తి చేశారు. కాశ్మీర్ ప్రభుత్వం 16 మంది దుండగులను నిర్బంధించింది.

కాని అబ్దుల్లా అనుచరుల అఘాయిత్యాలు తగ్గలేదు. తిరిగి ఫిబ్రవరి 24 వ తేదీన ఈ ముఠావారు పాకిస్తాన్ అనుకూల వర్గాలతో కలిసి శ్రీనగర్‌లో జాతీయ మహాసభ కార్యకర్తలపై దాడి చేశారు. ఈ ఘటనలు భారతీయులందరికీ ఆందోళన కలిగించుతాయి.

పాకిస్తాన్ ప్రభుత్వం కాశ్మీర్‌లో కల్లోలాలను రేపగోరుతున్నదని లోగడ వ్యక్తమైన పాకిస్తాన్ గూఢచారుల వాఙ్మూలాల ద్వారానే స్పష్టమైంది. ఇటీవల పాక్ ప్రధాని ఫిరోజ్‌ఖాన్ నూన్ ఒక కరాచీ సభలో ప్రసంగిస్తూ, భారతదేశం కాశ్మీర్ విషయంలో తన వైఖరిని మార్చుకోని పక్షంలో తీవ్ర పరిణామాలు తప్పవని బెదిరించారు. జనవాక్య సేకరణ జరగాలని, అంతవరకూ భారతదేశంతో కాశ్మీర్ విలీనీకరణ చెల్లదని విద్వేష ప్రచారం చేస్తున్న అబ్దుల్లా అనుచరులు, పాక్ గూఢచారులు కలిసికట్టుగా, ఒక పథకం ప్రకారం కాశ్మీర్‌లో, ఈ దౌర్జన్యాలను కొనసాగిస్తున్నారా అని ఎంచవలసి ఉంటుంది.

అబ్దుల్లా అనుచరుల అఘాయిత్యాలను, భారతదేశంలోని ప్రజాస్వామ్యవాదులందరూ నిరసిస్తారు. అబ్దుల్లా వైఖరి భారత, కాశ్మీర్‌ల శ్రేయస్సుకు విరుద్ధమైనదని, పాకిస్తాన్ కుట్రలకు తోడ్పడుతుందని కాశ్మీర్ ప్రజలు గుర్తించగలరు.

# లంక - రష్యా ఆర్థిక ఒడంబడిక

కొలంబో, ఫిబ్రవరి 25

లంక - రష్యా దేశాలు నేడు ఆర్థిక సాంకేతిక సహకార ఒప్పందాన్ని చేసుకొన్నాయి. ఈ ఒప్పందం ప్రకారం 14 కోట్ల 20 లక్షల రూపాయలు రష్యా లంకకిస్తుంది. ఈ ధనంతో రష్యానుంచి యంత్రాలను కొనవచ్చును. సాంకేతిక నిపుణులను పిలిపించుకోవచ్చును.

నీటిపారుదల విద్యుత్‌పథకాలు, చెరుకు పత్తిపంట పథకాలను సోవియట్ ప్రభుత్వం తయారుచేసి ఇస్తుంది. ఒక లోహకర్మాగారాన్ని, మోటారుటైర్లు ట్యూబుల ఫ్యాక్టరీని నెలకొల్పుతోంది. లంకవిద్యార్థులకు రష్యాలో సాంకేతిక శిక్షణ నిస్తుంది.

రష్యాఇచ్చే అప్పును 12 సాలుసరి వాయిదాల్లో చెల్లించాలి. దీనికి వడ్డీ నూటికి రెండున్నర మాత్రమే. అప్పును వస్తురూపంలోనూ, స్టెర్లింగు రూపంలోనూ చెల్లించవచ్చును.

# ఉరుములు-మెరుపులు

"ఇది ప్రజా ప్రభుత్వమన్న సంగతి గుర్తుంచుకోండి!"

[ఆంధ్ర అసెంబ్లీలో ప్రగడ కోటయ్య]

శ్రీ వావిలాల స్వీయ ప్రయోజనాలు సాధించుకోగలిగిన వారికి మాత్రం యిది "ప్రజా ప్రభుత్వం"గా కన్పించుతూంది. మరొకరు గుర్తు చేయాలిసిన అవసరమేలేదు. ఈ పరిపాలన క్రింద నలిగిపోతున్న వారు దీనిని "ప్రజాప్రభుత్వం"గా ఎలాగూ గుర్తించరు.

* * *

"ఉపాధ్యాయ వృత్తి చాల గొప్పది. ఆ వృత్తిని కొనసాగించే వారు ఉపవాసాలకు కూడ సిద్ధం కావాలి."

[కల్లూరి సుబ్బారావుగారు అసెంబ్లీలో]

గౌరవప్రదమైన ఉపాధ్యాయ వృత్తిని కొనసాగించే వారిని ఉపవాసాలు పెట్టే విధానాన్ని మంత్రివర్గం అనుసరించటం మాత్రం గౌరవప్రదం కాదు సుమా!

* * *

"నేనూ, నా పార్టీ ఈ దేశాన్ని పాలిస్తున్నంతకాలం సమ్మెల్ని ప్రోత్సహించడానికి సాహసించే వారిపై కఠిన చర్య తీసుకుంటాం."

[శ్రీ కల్లూరి సుబ్బారావుగారే]

అసెంబ్లీ సభ్యులుగా వున్నంత మాత్రానే "ఈ ధిక్కారమున్నైతునా?" అంటున్నారు. అమాత్యపదవుల్లోనైతే యింకెంత ఉగ్రరూపం ధరించుతారో!

* * *

"ఇదిగాని ఈ ఉపాధ్యాయులకు అజ్ఞానం అపారం!"

[శ్రీ కల్లూరి వారే]

బ్రతికే లేక బడిపంతులు వృత్తి చేపట్టడంవల్ల, భార్యాబిడ్డల [illegible] కాబోలు బాలబాలికలకు బోధించునది విజ్ఞానమైనా- కల్లూరివంటి జ్ఞానుల చేత 'అజ్ఞానం' అనిపించుకోవలసి వస్తున్నది.

# ట్యునీషియా సరిహద్దుల్లో ఫ్రెంచి సేనల సమీకరణ

## ట్యునీషియా ప్రభుత్వ ప్రకటన

ట్యూనిస్, ఫిబ్రవరి 25

ట్యునీషియా - అల్జీరియా సరిహద్దులలో ఫ్రెంచి సైనికబలాల సమీకరణ పెద్ద ఎత్తున సాగుతున్నదని ట్యునీషియా ప్రభుత్వ సమాచార శాఖవారు నేడిక్కడ ప్రకటించారు.

ఈవేళ ఉదయంనుంచి సైనికులు, సాయుధ పటాలాలు, సైనిక లారీలూ ట్యునీషియా సరిహద్దులలో పెద్ద ఎత్తున సమీకృతమవుతున్నాయి. ట్యునీషియా సైనిక చౌకీలకు అభిముఖంగా అల్జీరియా భూభాగంలో ఈ సమీకరణ జరుగుతున్నదని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఒక ఫ్రెంచివిమానం ట్యునీషియా సైనిక చౌకీల ఆరాలుతీస్తూ ట్యునీషియా భూభాగంపై ఎగిరినదని ఆ ప్రకటనలో వివరించారు.

ట్యునీషియా భూభాగంలో, బిజర్తావద్ద ఫ్రెంచి జెట్ ఫైటర్ విమానం కూలిపోయిన ఫలితంగా ఒక ట్యునీషియన్ రైతు మరణించాడని ట్యునీషియా విదేశాంగమంత్రి ఈవేళ మరొక ప్రకటన చేశారు. ఫ్రాన్సుకు ఆ ప్రకటనలో ఆయన తన తీవ్ర అధిక్షేపణ తెలిపారు.

ఫ్రెంచి విమానాలు తమ ఆక్షేపణలను లక్ష్యపెట్టక అదేపనిగా తమ భూభాగంపై ఎగురుతున్నవనీ, ఇది ప్రమాదకర పరిణామాలకు దారితీయవచ్చుననీ హెచ్చరిస్తూ ట్యునీషియా ప్రభుత్వ సమాచారశాఖ ప్రకటించింది.

# పశ్చిమ జర్మనీకి అణ్వాయుధాలు

హాంబర్గ్, ఫిబ్రవరి 25

పశ్చిమ జర్మనీ సేనలకు అణ్వాయుధాలు ఇవ్వడం సైనికవ్యూహ్యాత్మక దృష్ట్యా చాలా అవసరం అని ఉత్తర అట్లాంటిక్ కూటమి సర్వసేనాని జనరల్ లారిస్ నార్‌స్టాడ్ నేడిక్కడ చెప్పారు.

జర్మనీ సేనలు పాతకాలపు ఆయుధాలతోనే వుండడం వల్ల లాభం లేదనీ, మరొక యుద్ధప్రమాదం పూర్తిగా అంతరించేవరకు రక్షణ శక్తిని పెంచుకోవలసిందేననీ ఆయన అన్నారు.

# పామీర్ హిమ కాసారాలు

## ఎండిపోతున్నట్లు సోవియట్ శాస్త్రజ్ఞుల వెల్లడి

లెనిన్‌గ్రాడ్, ఫిబ్రవరి 25

సోవియట్ కొండలలో గల హిమ కాసారాలన్నిటిలోకీ పెద్దదైన ఫెడ్‌చెంకో కాసారం గత పాతికేళ్ళలోనూ 250 మీటర్లు కరిగిపోయిందని లెనిన్‌గ్రాడ్ యూనివర్సిటీ శాస్త్రజ్ఞుల బృందంవారు ఇటీవల అక్కడికి వెళ్ళి కనిపెట్టారు.

ఈ కాసారం పామీర్ పర్వత పంక్తిలోవుంది. దీని పొడవు 70 కిలోమీటర్లు, వెడల్పు 1700 నుంచి 3100 వందల మీటర్ల వరకూ వుంటుంది. దీని వైశాల్యం ఎనిమిది తొమ్మిది వందల కిలోమీటర్లు. కొన్ని కొన్ని చోట్ల దీని మందం 500 మీటర్లవరకూ వుంది.

వేసవికాలంలో ఈ కాసారాన్ని సోవియట్ శాస్త్రజ్ఞులు [illegible] పరిశీలించడానికి సన్నాహాలు చేస్తున్నారు.

లెనిన్‌గ్రాడ్ బృందానికి నాయకత్వం వహించిన ప్రొఫెసర్ ఒలెగ్ ద్రోజ్‌దోవ్ టాస్ విలేఖరితో మాట్లాడుతూ హిమకాసారాలు కరిగి పోతున్నాయంటే వాతావరణం వెచ్చనవుతున్నదని దానర్థం అన్నారు. హిమకాసారం దిగువ భాగం [illegible] ఆయన చెప్పారు. కొండల్లోని కొన్ని నదులకు ఈ హిమకాసారాలవల్లనే నీరు లభిస్తుంది. పైరు పంటలకు నీరందించే [illegible] ఇక్కడనుంచే [illegible] కాబట్టి ఈ హిమకాసారాల పరిశీలన చాలా ముఖ్యమైనదని ఆయన అన్నారు.

అస్సాం శాసనసభ ఆజాద్ మరణానికి సంతాపం తెలియచేస్తూ తీర్మానం చేసింది.

# లోహపరిశ్రమలో రష్యా విజయం

## అమెరికా శాస్త్రజ్ఞుల ప్రశంస

న్యూయార్క్, ఫిబ్రవరి 25

అమెరికాలో లోహశాస్త్రజ్ఞులు కొందరు ఇటీవల రష్యా సందర్శించినప్పుడు అక్కడ రష్యావారు లోహపరిశోధనలలో సాధించిన విజయాలను గాంచి ఆశ్చర్యపోయారని "వాల్ స్ట్రీట్ జర్నల్" అనే పత్రిక వ్రాస్తోంది. రష్యా వెళ్లివచ్చిన కొందరు శాస్త్రజ్ఞులతో ఈ పత్రికవారు ఇంటర్వ్యూ చేశారు.

మెసాచుసెట్స్ సాంకేతిక కళాశాలలో లోహశాస్త్రాచార్యుడు నికోలాస్ గ్రాంట్ లోహపరిశోధన విషయంలో సోవియట్ శాస్త్రజ్ఞులు మనకన్న ఎక్కువధనాన్ని, కాలాన్ని వినియోగిస్తున్నారనడంలో సందేహం లేదు అని అన్నారు.

న్యూయార్క్ యూనివర్సిటీ లోహశాఖ అధిపతి డాక్టర్ జాన్ విల్సన్ వచ్చే ఐదేళ్ళలోనూ రష్యావారి ఘనవిజయాలు బైటపడతాయన్నారు. ఆ తర్వాత మనం వారినందుకోడానికెంతో కాలం పడుతుందన్నారు.

వందతాప, హీనతాపాలలో లోహపుస్థితి ఎలా వుంటుంది, వాయుపీడన ఎక్కువయినప్పుడు ఎలా వుంటుంది అన్న విషయాన్ని కనిపెట్టడానికి సోవియట్ శాస్త్రజ్ఞులు శక్తివంతమైన లోహసూక్ష్మదర్శని యంత్రాలను వాడుతున్నారు. ఈ పరికరాలలో కొన్ని అమెరికన్ పరికరాలకన్న చాలా అభివృద్ధి చెందినవి. మూలపరిశోధనలను త్వరగా వినియోగానికి తేవడంలో రష్యన్లు సిద్ధహస్తులు అని ఆ పత్రిక పేర్కొంది.

రెండువేల అయిదువందల డిగ్రీల వేడిమికి కూడా తట్టుకొనగలిగేటట్లు లోహం, మన్ను కలిపిన మిశ్రలోహాలను తయారు చేయటం కూడా సోవియట్ శాస్త్రజ్ఞులు అమెరికా వారిని మించిపోయారు. చూర్ణలోహశాస్త్రంలో కూడా వీరు అమెరికా వారిని మించిపోయారు.

రష్యాలో లోహశాస్త్ర శోధనకిచ్చే ప్రాధాన్యాన్ని చూసి అమెరికా శాస్త్రజ్ఞులు చాలా మెచ్చుకొన్నారు. నిరుడు రష్యాలోని ఉన్నత లోహశాస్త్ర కళాశాలల్లో 4500 మంది పట్టభద్రులయ్యారు. దీనితో పోల్చిచూస్తే అమెరికాలో పట్టాపుచ్చుకొన్న వారిసంఖ్య 800 మాత్రమే అని అమెరికన్ శాస్త్రజ్ఞులంటున్నారు. రష్యాలో ఉక్కు ఉత్పత్తిని పెంచడానికి వేసిన పథకాలు చాలా సహజంగా వాస్తవంగా వున్నాయన్నారు. (టాస్)

# కల్లుగీత సలహా సంఘం

హైదరాబాద్, ఫిబ్రవరి 24

నేడు శాసనసభలో పి.డి.యఫ్.-కమ్యూనిస్టు సభ్యుడు శ్రీ ఎల్లబండా రెడ్డిగారడిగిన ఒక ప్రశ్నకు రెవెన్యూ మంత్రి కళా వెంకటరావుగారు సమాధానం ఇస్తూ తెలంగాణా ప్రాంతంలో కల్లుగీత సలహాసంఘం అనేది లేదు కనుక దాన్ని ఆంధ్రకంతకు విస్తరించే సమస్య ఉత్పన్నం కాదన్నారు.

ప్రశ్న: అలాంటి సంఘాన్ని నియమించాలనే ఉద్దేశ్యం వుందా?

జ: అవసరమని ప్రభుత్వం భావించడంలేదు.

ప్రశ్న: ఇలాంటి సంఘం కావాలని అనే, సొసైటీలవారు కోరుతున్నారు. మీకు తెలుసా?

జ: సలహా అక్కర లేదు. మంత్రికి అధికారులకూ అంతా తెలుసు. మాకు ఈ కమిటీ సలహా అవసరం లేదు.

ప్రశ్న. పూర్వం హైదరాబాదు రాష్ట్రంలో ఇలాంటి కమిటీ వుండేదని అది [illegible] మంత్రిగారికి [illegible]

జ: అది మా రికార్డుల్లో లేదు.

ప్రశ్న: ఎప్పుడైనా సలహా సంఘం వేసే ఉద్దేశం వుందా?

జ: [illegible] చెబుతాం.

( వి. వి. )

• • •

కేంద్ర విద్యా మంత్రిత్వశాఖలో పనిచేసే దాదాపు 2500 మంది సమావేశమై ఆజాద్ మరణానికి సంతాపం వెలిబుచ్చారు.

# చిన్న మొత్తాల పొదుపు వసూళ్లు

హైదరాబాద్, ఫిబ్రవరి 24

సోషలిస్టు సభ్యుడు శ్రీ పి. నరసింగరావుగారడిగిన ఒక ప్రశ్నకు ఆర్థికమంత్రి గోపాలరెడ్డిగారు శాసనసభలో జవాబిస్తూ 1957 డిసెంబరు వరకు చిన్నమొత్తాల పొదుపు పథకం క్రింద 2,62,43,034 రూపాయలు వసూలయ్యాయన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో కోటా పూర్తి అయిందన్నారు.

ప్రశ్న: ఇందులో రెవెన్యూ ప్రాతిపదికపైన ఎంత వసూలు చేశారు?

జవాబు: తెలియదు.

ప్రశ్న: ప్రభుత్వంలో ఏ శాఖ ఎక్కువ వసూలు చేసింది?

జవాబు: రెవెన్యూశాఖ ఎక్కువ వసూలుచేసింది. ప్రజలు రెవెన్యూ ప్రాతిపదికపైన ఇస్తామంటే నాకు అభ్యంతరంలేదు.

రామకృష్ణంరాజు: చిత్తూరుజిల్లాలో మొదట ఒక పరిమితి నిర్ణయించి ఆ తర్వాత ఆ పరిమితిని పెంచారు. బహుశా చిత్తూరుజిల్లా ప్రజలు ఖర్చు తక్కువ పొదుపు ఎక్కువ చేస్తారను కొంటాను.

వేముల కూర్మయ్య: ఫీల్డు లేబరు కోఆపరేటివ్ సొసైటీలవద్ద ఒక్కొక్కరినుంచి అయిదేసి రూపాయల చొప్పున బలవంతంగా వసూలు చేస్తున్నారు. ఈ విషయం ప్రభుత్వానికి తెలుసునా?

జవాబు: ఆ విధంగా ఇమ్మని ప్రచారం చేస్తున్నారు. అంతే.

రామకృష్ణంరాజు: ఇది పొదుపు ఉద్యమం కాదు. ఇది అప్పుఉద్యమమయింది.

జవాబు: ఈ పొదుపు అప్పుతో చేసినప్పటికీ ప్రమాదంలేని పొదుపు. పెళ్ళిళ్లలో ఎక్కువ డబ్బు ఖర్చుపెట్టకుండా, సినిమాలకు వెళ్ళకుండా తక్కువ ఖర్చుపెట్టి పొదుపు చేయమంటున్నాము. (వి. వి.)

# హరప్ప నాగరికత అవశేషాలు

## అహమ్మదాబాద్ సమీపంలో బయటపడ్డాయి

అహమ్మదాబాద్, ఫిబ్రవరి 25

అయిదువేల సంవత్సరాల క్రిందటి హరప్ప నాగరికతను గురించి మరి కొన్ని విశేషాలు తెలిపే అవకాశంగల మానవుని అస్థిపంజరాలు ఇక్కడికి యాభై మైళ్ల దూరంలో వున్న లోతాల్‌లో దొరికాయి.

పురాతత్వశాఖ పశ్చిమ మండలం డైరెక్టర్ శ్రీ యస్. ఆర్. రావు నాయకత్వానగల ఒక బృందం ఈ అస్థిపంజరాలను కనుగొన్నది.

లోతాల్ వద్దవున్న ఈ ప్రదేశం అయిదు వేల సంవత్సరాలక్రిందట బాగా అభివృద్ధి చెందిన ప్రాంతంగా పురాతత్వశాఖవారు పరిగణించి, ఇక్కడ నాలుగు సంవత్సరాలుగా పరిశోధనలు జరుపుతున్నారు.

# లోయర్ డివిజన్ గుమస్తా ఉద్యోగాలకు పోటీ పరీక్షలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25

లోయర్ డివిజన్ గుమస్తాల యోగ్యతలను నిర్ణయించే నిమిత్తం యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ వారు ఈ సంవత్సరాంతంలో పోటీ పరీక్షలు ఏర్పాటుచేస్తారని నేడిక్కడ అధికారికంగా ప్రకటించారు.

ఈ పరీక్షలలో కృతార్థులైనవారిని లోయర్ డివిజన్ గుమాస్తాగిరీలకు నియమిస్తారు. ఈ పరీక్షలకు హాజరు కాగోరేవారు మెట్రిక్, లేదా మ్యాట్రిక్ స్థాయిగల పరీక్షలో ఉత్తీర్ణులైనవారై వుండాలి.

# పాకిస్తాన్ పత్రికలపై గఫర్‌ఖాన్ విమర్శ

## ఆజాద్ మరణ వార్తకు ప్రాముఖ్య మివ్వలేదని

లాహోర్, ఫిబ్రవరి 25

పాకిస్తాన్ పత్రికలు, రేడియో మౌలానా అబుల్‌కలాం ఆజాద్ మరణ వార్తకు యివ్వవలసినంత ప్రాముఖ్యత యివ్వక పోవటం [illegible] నేషనల్ అవామీ పార్టీ నాయకుడు ఖాన్ అబ్దుల్ గఫర్‌ఖాన్ నేడు [illegible] ఆజాద్ [illegible] జరిగిన బహిరంగ సభలో ప్రసంగిస్తూ [illegible]

భారత, పాకిస్తాన్ దేశాల స్వాతంత్ర్యం సాధించడంలో ఆజాద్ నిర్వహించిన పాత్రను ఉగ్గడిస్తూ, ఆయనకు [illegible] నివాళులర్పించారు.

# సుందరయ్యగారి ప్రసంగం

[ మొదటి పేజీ తరువాయి ]

మేము చేసిన తప్పు అంచనాలవల్ల ఆనాడు ఓడిపోయాం.

కాని కమ్యూనిస్టుపార్టీ నాశనం కాలేదు. అలాగే 1948 లో కమ్యూనిస్టుపార్టీని నాశనం చెయ్యాలని చూచారు. అప్పుడూ సాధ్యంకాలేదు. 1955 తరువాతకూడ ఆ పని వారు చేయలేకపోయారు. అయితే ఆనాడు మేము భూసంస్కరణలు తెచ్చి 20 ఎకరాలకు సీలింగు పెట్టాలన్నాం. మరి యీనాడు ప్లానింగ్ కమిషన్ నిర్ణయించిన గరిష్టపరిమితి 3600 రూపాయలు మాత్రం. అంటే కృష్ణాజిల్లాలోని మాగాణి ప్రాంతంలో 15 ఎకరాలు మాత్రమే. కాని యిందులో కొన్ని మినహాయింపులు చేశారు. చెరుకుఫ్యాక్టరీగాని, పాలకేంద్రంలాంటి పశుపోషణ సంస్థలకు గాని, పండ్లతోటలకు, ట్రాక్టరుతో వ్యవసాయం చేయగల భూఖండాలకు గాని యీ సంస్కరణలు వర్తించవు. అంతేకాదు. కుటుంబనిర్వచనం లేకుండా భూసంస్కరణలు చేయటం ప్రజలను మోసం చేయటమే.

## భూసంస్కరణల బూటకం

"భూసంస్కరణలంటే మాటలా? సంస్కరణ చేయటానికి భూమి ఎక్కడిది? భూమిని సాగదీయటానికి యిది ఏమైనా రబ్బరా? పిల్లలు పుట్టించడం చేతనవుతుందిగాని భూమిని సాగదీయటంసాధ్యమా" అని రెవెన్యూ మంత్రి శ్రీ కళా వెంకట్రావుగారు ఉపన్యాసాలు యిస్తున్నారు. మరి వీరేనా భూసంస్కరణలు తెచ్చేది? కాని ఎలాంటి బిల్లయినా యింతవరకు లేదు. మార్చిలో ప్రకటిస్తారట. మరి ప్యాసయేది ఎప్పుడో! ఈలోగా బినామీ మార్పిళ్ళవల్ల అమ్మకాలవల్ల అసలు భూసంస్కరణలువర్తింపు పంపకానికి భూములూ మిగలవు.

ఇదివరకు ఖమ్మంలో భూసంస్కరణలు అమలుపెట్టడానికి లెక్కలు రాశారు. మొదట 90 వేల ఎకరాలు మిగులుతుంది అన్నారు. తరువాత కొన్ని రోజులకు 5 వేల ఎకరాలే అన్నారు. మరి యిప్పుడు అసలు లేదు అంటున్నారు. ఇంతేకాదు, 3600 రూపాయలు నికర ఆదాయం అంటే 30 ఎకరాలు అని కూడ ప్రచారంచేస్తున్నారు. ఇంత భూమి కుటుంబానికి గాదు, ఒక వ్యక్తికే అని కూడ అక్కడక్కడచెప్తున్నారు. అందువల్ల భూములన్నీ ముందు పంచుకుంటే యిక చట్టం తేవలసిన అవసరం వుండదంటున్నారు కళా వెంకట్రావుగారు.

ఇలాంటి భూసంస్కరణలు మాత్రం కమ్యూనిస్టుపార్టీ కోరడం లేదు. ముందుగా కుటుంబపరిమితులు విధించాలి. కుటుంబమనగాఏమిటి - భార్య, భర్త, పెండ్లికాని ఆడపిల్లలు మైనారిటీ తీరని మగపిల్లలు. యితరత్రా ముదుసలులు అని కమ్యూనిస్టుపార్టీ నిర్వచనం. అలాంటి 5 గురు సభ్యులుగలది కుటుంబము. అంతకు మించివుంటే ఆదాయం పరిమితికూడ పెంచాలి. ఇది మావ్యాఖ్యానం" అని సుందరయ్యగారు వివరించారు. యిలా పరిమితి పెట్టినట్లయితే ఆంధ్రదేశంలో 27 లక్షల కుటుంబాలకు కుటుంబం 1 కి ½ ఎకరం గాని, ఎకరం గాని యివ్వటానికి వీలుంది" అన్నారు.

## రంగాగారి వ్యతిరేకత

ఆయన ఇంకా ఇలా చెప్పారు: ఒకప్రక్క సంజీవరెడ్డిగారి ప్రభుత్వం భూసంస్కరణలు తెస్తామని అంటూనే [illegible] చేస్తున్నారు. రెండవప్రక్క రైతుబాంధవుడు రంగాగారు అసలుభూసంస్కరణలనే వ్యతిరేకిస్తున్నారు. రంగాగారిప్రచారమంతా భూస్వాముల రక్షణకే అని లెక్కలవల్ల బోధపడుతుంది. అంతేకాదు. ఎవరికి లేని ఈసీలింగ్ రైతుకు ఎందుకు అనే వాదనకూడ రంగాగారు లేవదీస్తున్నారు. నిజమే, వేల రూపాయలు తీసుకునే ఉద్యోగస్తులు, కోట్ల రూపాయల లాభాలు పొందే వ్యాపారస్తులు మిల్లు యజమానులు, వడ్డీ వ్యాపారస్తులు వున్నారు. వారి ఆదాయానికి కూడ సీలింగు పెట్టవలసిందే. దానికి మేము వ్యతిరేకులం కాదు. అయినప్పటికి దానిని అడ్డు పెట్టుకుని భూసంస్కరణలు వ్యతిరేకించటం ఘోరం.

ఈనాడు భూసంస్కరణలవల్ల నష్టపడేది 80 వేల కుటుంబాలు మాత్రం. లాభపడేది 27లక్షల కుటుంబాలు. ఆంధ్ర దేశంలో 20 ఎకరాలు పైబడ్డవారు 80 వేలు. (ఆంధ్ర జిల్లాలలో 50 వేలు తెలంగాణా ప్రాంతం 30 వేలు) 2 ఎకరాలనుంచి 5 ఎకరాలు వరకు 7 లక్షల కుటుంబాలవారు, 5 నుండి 10 ఎకరాలవారు 4 లక్షల కుటుంబాలు. 1 ఎకరం 2 ఎకరాల లోపు 25 లక్షల కుటుంబాలవారు, అసలు భూమి లేకుండా వ్యవసాయంపై ఆధారపడేవారు 27 లక్షల కుటుంబాలవారువున్నారు. ఈభూసంస్కరణలవల్ల వారికి ½ ఎకరం మొదలు ఎకరం వరకు ఇవ్వవచ్చు.

ఏటా చైనాలో 200 కోట్ల బస్తాలు తిండిగింజలు పండిస్తున్నారు. మన దేశంలో 65 కోట్ల బస్తాలు మాత్రమే పండించగలుగుతున్నాం. అందువల్ల కోట్ల రూపాయలు తిండిగింజలకొరకు విదేశాలకు ధారపోస్తున్నాం. అందువల్ల ఊరికే ప్రాజెక్టులు కట్టామంటేనే లాభం లేదు. ఆ నీరును రైతుకు అందించాలంటే కాలువలు త్రవ్వాలి. ఆనాడే సంస్కరణల ఫలితం వుంటుంది. అంతేకాదు. రైతులు భరించలేనంతగా యీనాడు అధికపన్నులు వున్నాయి. ఇంకా రాబోతున్నాయి. కాని అటు వృత్తిపనులకుమాత్రం డబ్బులేదని అంటున్నారు.

## ప్రజల యిబ్బందులు

ఆహారధాన్యాల ధరలతోపాటు రైతుకు అవసరమైన పనిముట్లు, ఇతర జీవితావసర వస్తువులకు రేట్లనిర్ణయం జరగాలి. అప్పుడు రైతులు తమ ధాన్యాన్ని గిట్టుబాటురేటుకు యివ్వగలుగుతారు. అలాగే చిన్న వ్యాపారస్తులు అమ్మకంపన్ను బిల్లువల్ల అనేక యిబ్బందులు పడుతున్నారు.

ఈ బిల్లువల్ల చిన్న వ్యాపారస్తులు ఉద్యోగస్తుల దయా దాక్షిణ్యాలపై ఆధారపడవలసి వస్తోంది. ఈ సమస్యపై శాసనసభలో మేము అనేక సూచనలు చేశాం. కాని ప్రభుత్వం వాటిని నిరాకరించింది. భూసంస్కరణలు లేకుండా దేశంలో ధనికులు మరింత ధనికులౌతూ, దరిద్రులు మరింత దరిద్రులౌతూ వున్నంతకాలం "సోషలిజం" అనే మాటకు అర్థం లేదు. ప్రతిమనిషికి ఉద్యోగం, తిండి, బట్ట, ఉండటానికి యిల్లు కల్పించిన నాడే సోషలిస్టు సమాజం. అంతవరకు ఎవరెన్ని కబురు చెప్పినా ఫలితంలేదు" అని శ్రీ సుందరయ్యగారు తమ ఉపన్యాసం ముగించారు.

అనంతరం గుడివాడ తాలూకా కమ్యూనిస్టు కమిటీ వివిధ గ్రామాలలో 10 వేలు రూపాయల వాగ్దానాలు చేయించగా, అందులో వసూలైన 5 వేల రూపాయల పార్టీ నిధిని సుందరయ్యగారికి సమర్పించారు. ఆయన తిరిగి ఆ 5 వేలు జిల్లాకమిటీకియిస్తూ ఇంకా ఎక్కువ మొత్తం పార్టీకి సహాయం చేయవలసిందిగా కోరారు.

తర్వాత శ్రీ కడియాల గోపాలరావు, శ్రీ కాట్రగడ్డ రాజగోపాలరావుగార్లుకూడామాట్లాడారు. "నాజరు దళం"వారు పల్నాటి యుద్ధం బుర్రకథ చెప్పారు. తెల్లవారు జామున 3½ గంటలు అయినప్పటికి ప్రజలు ప్రశాంతంగా కూర్చొని వినడం విశేషం.

## పట్టణంలో నిధి వసూళ్లు

24 వ తేదీ సోమవారం ఉదయం నుండి సాయంత్రంవరకూ గుడివాడ పట్టణంలో శ్రీ కాట్రగడ్డ రాజగోపాలరావుగారి నాయకత్వాన ఒక దళం ప్రతికొట్టుకూ తిరిగి సుమారు 850 రూపాయలు వాగ్దానాలు చేయించారు. సుమారు రు. 550 వరకు అప్పుడే వసూలయ్యాయి. ఇంకా ఇంటింటికి తిరిగి పార్టీనిధి వసూలు చేయటానికి దళాలు ఏర్పాటు చేయబడుతున్నాయి. ఇప్పటికి గుడివాడ టౌనులో మొత్తం 4 వేల రూపాయల పార్టీనిధి వసూలయింది. అందరూ అత్యంత ఆదరంతో కమ్యూనిస్టు పార్టీకి విరాళాలిచ్చారు.

## బొమ్ములూరులో

గుడివాడ తాలూకా బొమ్ములూరు గ్రామంలో 21 వ తేదీన కమ్యూనిస్టు పార్టీ బహిరంగసభ జరిగింది. ఆ సభలో జిల్లా కమ్యూనిస్టు నాయకులు శ్రీ కడియాల గోపాలరావు, శ్రీ అట్లూరి సీతారామయ్యగార్లు ఉపన్యసించారు. అనంతరం కాజ దళంవారిచే బుర్రకథ చెప్పబడింది.

గత మూడున్నర మాసాల్లో బీహార్‌లో మశూచికం వలన దాదాపు [illegible] వెయ్యిమంది మరణించారని అధికార వార్త తెలుపుతోంది.

• • •

లంక దేశంలో ప్రస్తుతం పర్యటిస్తున్న సోవియట్ పార్లమెంటు ప్రతినిధివర్గం ఆజాద్ మరణానికి తమ సంతాపం తెలుపుతూ నెహ్రూగారికి తంతి నిచ్చారు.

# త్వరలో చంద్ర మండలానికిరాకెట్

## సోవియట్ శాస్త్రజ్ఞుల వెల్లడి

మాస్కో, ఫిబ్రవరి 25

భూమ్యాకర్షణ శక్తిని అధిగమించి విశ్వాంతరాళంలోకి ప్రవేశించడానికి కావలసిన రాకెట్ వేగాన్ని, అంటే సెకండుకు 11.2 కిలోమీటర్ల వేగాన్ని ఇప్పుడు సోవియట్ శాస్త్రజ్ఞులు సాధించారు. అందుకని త్వరలోనే ఒక రాకెట్‌ను చంద్రమండలానికి పంపడం సాధ్యం అని ప్రముఖ సోవియట్ శాస్త్రజ్ఞుడు టిగ్రాన్ మెల్కుమోవ్ "విమానసమాచార్" అనే పత్రికలో వ్రాశారు.

అయితే అంతరిక్ష ప్రయాణంలో ప్రధానంగా ఎదుర్కొనేది ఇంధన సమస్య. దీన్ని ముందు పరిష్కరించవలసి వుంటుందని ఆయన పేర్కొన్నారు. విశ్వవీధిలో సౌరశక్తిని విరివిగా వాడవచ్చును. ఇది కాక అంతరణుశక్తిని వినియోగించడానికి తగు అవకాశాలుకూడా గోచరిస్తున్నాయి. కాగా ఈ విషయంలో ఇంకా పరిశోధనలు సాగవలసిన అవసరం వుందని ఆయన అంటున్నారు. ఇంధనశక్తిని బాగా పొదుపుగా వాడుకొనడానికి సులభమార్గం ఒక్కటే. అది తాపకేంద్రకశక్తిని అదుపులోకి తేవడం అని ఆయన అన్నారు. (టాస్)

# బ్రిటన్‌లో రాకెట్ స్థావరాలు: రష్యా విమర్శ

లండన్, ఫిబ్రవరి 25

బ్రిటన్‌లో అమెరికా రాకెట్ స్థావరాలను నెలకొల్పడం వల్ల అది బ్రిటన్, అమెరికా, రష్యా ప్రజలందరికీ కూడా ప్రమాదకరంగా పరిణమించగలదని మాస్కో రేడియో నేడు వ్యాఖ్యానించింది.

విదేశాలలో తమకు స్థావరాలుండడంవల్ల అమెరికా పరిస్థితి ఏమైనా మెరుగుగావుందా? ఆయుధాలు యుద్ధంకోసం వాటిని ఎవరిమీదనో ప్రయోగించడంకోసం చేర్చుతున్నారు. ఎవరిమీదనో అంటే సోవియట్ యూనియన్‌మీదనని వారి అభిప్రాయం.

సరే: మాకు ప్రమాదం ఏర్పడితే మా రక్షణవ్యూహాన్ని మేం చూసుకోవలసి వుంటుంది. ప్రస్తుతదశలో యుద్ధానికి హద్దులూ అవరోధాలూ లేవు. అమెరికా మొదటిగుండు పేల్చితే తిరుగుదెబ్బ తనకు తగలదని నమ్మకం అమెరికా కుందా?

అందుకని బ్రిటన్‌లో అమెరికన్ రాకెట్లు అమెరికన్లకు, రష్యన్లకు ఎంత పీడాకరమో బ్రిటిష్ వారికి కూడా అంతే పీడాకరం. ఇది సులభగ్రాహ్యమైన విషయం. అమెరికన్లకు తెలియకుండా దాచిపెడుతున్న సత్యంఇదే అని మాస్కో రేడియో అమెరికన్ ప్రజలనుద్దేశించి ప్రసారం చేసింది.

# కేంద్రమంత్రివర్గంలో రాబోయేమార్పులు

## రాజకీయవర్గాల్లో వూహలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25

మౌలానా ఆజాద్‌స్థానంలో ఇక ముందు నియమించబోయే విద్యామంత్రికి కేబినెట్ హోదా యివ్వబడదని తెలుస్తోంది. ఇంతకుముందు న్యాయశాఖామంత్రికికూడా కేబినెట్ హోదా వుండేది. శ్రీ అశోకసేన్‌ను న్యాయశాఖామంత్రిగా నియమించిన తరువాత ఆ హోదా తగ్గించబడింది.

విద్యామంత్రిగా ప్రొఫెసర్ హుమయూన్ కబీరును నియమించవచ్చుననీ, ఇప్పుడాయన నిర్వహిస్తున్న సివిల్ వైమానిక మంత్రిత్వ శాఖను బహుశా మద్రాసు ఆర్థికమంత్రి శ్రీ సుబ్రహ్మణ్యంకు అప్పగించవచ్చుననీ తెలుస్తోంది.

అయితే ఆర్థికమంత్రిని ఎవరిని నియమిస్తారనే సమస్య యింకా ఒక పెద్ద సమస్యగానేవుంది. శ్రీ కృష్ణమీనన్‌ను ఆర్థికమంత్రిగానియమించితే ద్వితీయ ప్రణాళికను జయప్రదంగా నిర్వహించడానికి వీలవుతుందని చాలమంది భావించుతున్నారు. అయితే ఆయనను ఆర్థిక మంత్రిగా నియమించడానికి కాంగ్రెసుపార్టీలో స్వార్థప్రయోజనాలుగల ఒక బలమైన వర్గం తీవ్రంగా ప్రతిఘటించగలదని, అందువలన కృష్ణమీనన్ ఆర్థిక మంత్రి అయ్యే అవకాశం అంతగాలేదని ఇక్కడ భావించబడుతున్నది. (ఏ. పి. ఏ.)

# సంఘాన్ని గుర్తించడంలో రైల్వే అధికార్ల పక్షపాతం

## రైల్వే ఎంప్లాయీస్ యూనియన్ బెజవాడ దక్షిణబ్రాంచి సభలో విమర్శ

చీరాల, ఫిబ్రవరి 4

దక్షిణరైల్వే ఎంప్లాయీస్ యూనియన్ బెజవాడ దక్షిణ బ్రాంచి ప్రథమ వార్షిక మహాసభ 28 వ తేదీన చీరాల రహదారీ బంగళా ఆవరణలో 'కామ్రేడ్ వీరయ్య నగర్'లో జరిగింది. సభకు బెజవాడ దక్షిణ బ్రాంచి వివిధ సెక్షన్లనుండి ఇంజనీరింగ్, లోకో, ట్రాఫిక్ పనివారల ప్రతినిధులు సుమారు 400 మంది హాజరయ్యారు. ఉదయం 10 గంటలకు 500 మంది రైల్వే కార్మికులు బ్యాండు వాయిద్యాలతో నినాదాలతో పురవీధులలో ఊరేగింపు జరిపారు. తరువాత స్టేషన్ వద్ద యూనియన్ జెండా ప్రతిష్ఠాపన చేశారు.

మధ్యాహ్నం 1 గంటకు 'వీరయ్య నగర్'లో ప్రతినిధుల సమావేశం ప్రారంభమైంది. చిట్టగుంట బ్రాంచి అధ్యక్షులు శ్రీ వై. సుందరమూర్తిగారు సభకు అధ్యక్షత వహించారు. ఆంధ్రప్రదేశ్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి, రైల్వే ఎంప్లాయీస్ యూనియన్ మాజీ ప్రధాన కార్యదర్శి, పార్లమెంట్ సభ్యులు శ్రీ కె. యల్. నరసింహం గారు సభను ప్రారంభించుతూ గత 40 ఏండ్ల యూనియన్ చరిత్రను సమీక్షించారు. శ్రీయుతులు షేక్ మీరా, కృష్ణయ్య, అప్పారావు, బి. శ్రీరాములు, యస్. శీతయ్య, యం. హొరేస్, వెంగల్వ రాయుడుగారలు వివిధ కార్మిక సమస్యలపై ప్రసంగాలు చేసినపిదప తీర్మానాలు చేశారు. నూతనకార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

సాయంత్రం 5 గంటలకు స్టేషన్ వద్ద జరిగిన బహిరంగసభకు శ్రీ సుందరమూర్తిగారు అధ్యక్షత వహించారు. శ్రీ కె. ఎల్. నరసింహం గారు మాట్లాడుతూ ఎంప్లాయీస్ యూనియన్ రికగ్నిషన్ లేకుండానే ఎక్కువ సంవత్సరాలు కార్మికుల బలంపై పనిచేసిందన్నారు. అధికారులు కాగితంపై ఏసంఘాన్ని గుర్తించినప్పటికి, ఆ సంఘానికి కార్మికుల అండదండలు లేకపోతే ఆ గుర్తింపునకు విలువలేదని, యీ రోజు జాతీయ ట్రేడ్ యూనియన్ నాయకులతో నడుపబడే 'సంఘ్' కేవలం అధికారుల ప్రాబల్యం వలన బ్రతుకుతున్నదని దానిని కార్మికులు వాస్తవంగా బలపరచటం లేదని చెప్పారు. రైల్వేఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యాన బెజవాడలో 400 మంది కార్మికులు జనరల్ మానేజరు వద్దకు వెళ్లితే ఆయన వారితో మాట్లాడక తప్పలేదని తెలిపారు. పార్లమెంటులో ముఖ్యే యిద్దరు కార్మిక ప్రతినిధులు ప్రతిపక్షంలో వుండి, కార్మిక సమస్యలపై ప్రభుత్వాన్ని సవాలు చేయగలుగుతున్నారంటే రికగ్నిషన్ లేదని భయపెట్టేవారి మాటలకు మోసపోవద్దని రైల్వే కార్మికులను హెచ్చరించారు.

దక్షిణ రైల్వే ఎంప్లాయీస్ యూనియన్, అఖిల భారత రైల్వే మెన్సు ఫెడరేషన్లో ఒక భాగంగా వుందనీ, దానిని ప్రభుత్వం గుర్తించక తప్పదని చెప్పారు. రెండవ ప్రణాళిక సక్రమంగా అమలు జరగాలంటేను, రైల్వేలలో ప్రమాదాలు తప్పి, ప్రజోపయోగంగా నడవాలంటేను కార్మికులకోర్కెలను ప్రభుత్వం మన్నించాలని అన్నారు. ముఖ్యంగా ఎక్కువ ప్రాతినిధ్యం గల అఖిలభారత రైల్వే మన్సు ఫెడరేషన్ను, దక్షిణ రైల్వే, ఎంప్లాయీస్ యూనియన్ను గుర్తించాలని చెప్ప ముగించారు.

తరువాత దక్షిణరైల్వేఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీ సి. హెచ్. శివరామశర్మగారు మాట్లాడుతూ ప్రభుత్వం పనివారల జీతాలను పెంచేటపుడు యీ రోజు పెరిగిన జీవిత ప్రమాణాన్ని దృష్టిలో వుంచుకొని జీవనస్థాయి పెరిగేటట్లు జీతాలను నిర్ణయించాలని, నామమాత్రంగా జీతాలను పెంచి కొనుగోలు శక్తి పడిపోయేటట్లు చూడరాదని చెప్పారు. పెన్షన్ స్కీము గురించి చెబుతూ, ఇది 3, 4 తరగతి పనివారలకు నిరుపయోగంగా వుందని, ఇతర కేంద్రఉద్యోగులకిచ్చే పెన్షన్కు దానికి చాలా వ్యత్యాస ముందని, రైల్వేలలో దానిని అమలుజరపాలంటే ప్రతి కార్మికుడు గ్రాట్యూటీ (బోనస్)వల్ల పొందే సౌకర్యాన్ని యథాతథంగావుంచి పెన్షన్ రేటును ఇప్పటిదానికంటే పెంచి అమలు జరపాలని కోరారు. ట్రేడ్ యూనియన్ ఉద్యమాన్ని చీల్చడానికి దీనిని వినియోగించుతున్నారని అన్నారు. ఉదాహరణకు - 1957 లో ప్రకటించిన 'నూతన పథకం' వల్ల సదరన్ రైల్వేలో 170 వేల మంది కార్మికులలో 6 వేల మందికి మాత్రమే లాభం చేకూరిందని, ఆ లాభమైనా జాతీయ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ నాయకులైన పి. సుబ్బరామయ్యగారి లాంటి వారికి సంఘ విచ్ఛిన్న చర్యలకు ప్రమోషన్ల నీయడానికి మాత్రమే వీటి నుపయోగిస్తున్నారని, శ్రీ సుబ్బరామయ్యకు జీతం రు 110/- వుంటే ప్రమోషన్ క్రింద ప్రత్యేక స్కేలు ఏర్పాటుచేసి రు. 250/- జీతం పెంచి 1956 ఏప్రిల్ నుండి బకాయీలతో చెల్లించారని, యీ విధంగా సీనియర్లకు అన్యాయం చేశారని చెప్పారు. రైల్వే ప్రమాదాలు అరికట్టే మిషతో రక్షణ ఇన్స్పెక్టర్ల ఉద్యోగాలు సృష్టించారు గాని, అసలు రక్షణకు కీలకమైన రాత్రి పెట్రోల్ మనుష్యులసంఖ్యను పెంచలేదని, ఇలాంటి ఉద్యోగాలను రైల్వేబోర్డు సభ్యుల ఆఫీసర్ల ఆశ్రితులకు, కటాయిస్తూన్నారని, కాని రైలు ప్రమాదాల నరికట్టడానికి వాస్తవచర్యలుతీసుకోలేదని అన్నారు. రైల్వే కార్మికులు మెలకువతో తమ బాధ్యతలను నెరవేరుస్తూ, ఎంప్లాయీస్ యూనియన్ను బలపరచాలని చెప్పారు.

దక్షిణరైల్వే ఎంప్లాయీస్ యూనియన్ ఉపాధ్యక్షులు శ్రీ జి. నూకరాజుగారు బెజవాడ డివిజనల్ పరసనల్ ఆఫీసులో జరిగే కుంభకోణాన్ని వెల్లడిచేస్తూ దీనికంతకూ 'సంఘ్' పక్షపాతిగా వ్యవహరిస్తున్న డి. పి. ఓ. గారి నిరంకుశ చర్యలే కారణమని చెప్పారు.

తరువాత దక్షిణరైల్వే ఎంప్లాయీస్ యూనియన్ సహాయ కార్యదర్శి శ్రీ పి. శ్రీరాములుగారు వివిధ కార్మిక సమస్యలపై ప్రసంగించారు. సభాధ్యక్షులు శ్రీ సుందరమూర్తిగారు ఎంప్లాయీస్ యూనియన్ ఎక్కువ సభ్యత్వంతో వివిధ బ్రాంచీల నేర్పరచుకొని ఎలా పురోగమిస్తుందో తెలియజేశారు. నూతనంగా ఎన్నుకోబడిన బ్రాంచి కార్యదర్శి శ్రీ ఆర్. వరదరాజులు గారు మహాసభలో చేసిన తీర్మానాలు తెలియజేశారు. సభానంతరం శ్రీ కె. ఎల్. నరశింహంగారు బ్యాండు దళానికి వెండికప్పు బహూకరించారు. సభలో ఆమోదించిన తీర్మానాలు ఇవి .

విద్యామంత్రి అబుల్ కలామ్ ఆజాద్ అకాల మరణానికి, అసన్ సోల్ బొగ్గు గనులలో ప్రమాదానికి గురైన కార్మికుల మరణం పట్ల సానుభూతిని వెల్లడించారు.

(2) ఏప్రిల్ నెలాఖరులోగా జనరల్ ట్రాన్స్ఫర్ ఉత్తర్వులు యిచ్చి పిల్లల చదువుకు వీలుకల్పించాలి.

(3) డి. పి. ఓ. గారు 'సంఘ్' ప్రోత్సాహంతో కార్మికుల అప్పీళ్ళను కూడా చూడకుండా త్రోసివేస్తున్నారు. దీనివల్ల డివిజన్లో అశాంతి ఏర్పడింది. డి. పి. ఓ. గారు వహిస్తున్న ఎంప్లాయీస్ యూనియన్ వ్యతిరేక పంథాను ఖండిస్తూ, కార్మికుల కోర్కెలు పరిష్కరించేటప్పుడు వీరి పక్షపాతాన్ని అరికట్టాలని డివిజనల్ సూపరింటెండెంటును కోరారు.

4. పెన్షన్ స్కీములోని లోపాలను మార్పుచేసి, ఇతర కేంద్ర ప్రభుత్వోద్యోగుల కిచ్చే సౌకర్యాలను అమలుజరపాలని, అంతవరకు పెన్షన్ స్కీమును అమలుజరపరాదని కోరారు.

5. ఇ. ఎస్. ఆర్. పనివారికి దినకూలి రు. 2-8-0 ఇవ్వాలని, ఎ. ఎల్. సి. లిస్టులు సీనియారిటి ప్రకారం సక్రమంగా తయారుచేసి ఖాయం చేయాలని కోరారు.

6. 25 లివర్సు కంటే ఎక్కువ యున్న కాబిన్లలో లివర్ పుల్లర్సును సెంట్రల్ రైల్వేలోవలె వేయాలని వీరి జీతాల స్కేలు రు. 75-105 గా మార్చాలని కోరారు.

7. నాల్గవతరగతి పనివారికి రు 30, 35, గ్రేడును రద్దుచేసి, రు 40-60 ల గ్రేడుగా మార్చాలి.

నూతన సంవత్సరానికి అధ్యక్షులుగా శ్రీ బి. సూర్యప్రకాశరావు గారిని, బ్రాంచి కార్యదర్శిగా శ్రీ ఆర్. వరదరాజులుగారిని, సహాయ కార్యదర్శులుగా శ్రీ కె. వెంకటేశ్వరరావు, శ్రీ కృష్ణయ్యగార్లను, కోశాధికారిగా శ్రీ షేక్ మీరా గార్లను, ఇంకా 20 మందిని బ్రాంచి కార్యవర్గాన్ని ఎన్నుకొన్నారు.

## ప్రకటన

అన్ని రకముల లివ్ స్టాక్ సప్లయి చేయుటకు టెండర్లు తీసుకొను ఆఖరు తేదీ 12, 14 తేదీల విశాలాంధ్ర దినపత్రికలో ప్రకటితమయిన 24-2-1958 నుండి 1958 మార్చి 3 వ తేదీ వరకు గడువు పొడిగించడమైనది. టెండర్లు అదే రోజు సాయంత్రం 3 గంటలకు యీ ఆఫీసులో తెరువబడును.

డైరెక్టర్
యానిమల్ హాస్బెండ్రీ & ఫిషరీస్,
ఆంధ్రప్రదేశ్, హైదరాబాద్,
25—2—1958.

## 'పొగాకు' త్రైమాసపత్రిక

ఇందు పొగాకు సాగుబడి, అమ్మకము, పరిశోధనా ఫలితములు, మార్కెటు రిపోర్టులు, మున్నగు విషయములపై అమూల్యమైన రచనలు వెలువడును. పొగాకు పంటదార్లకు, వర్తకులకు, వాడకందార్లకు మీ ప్రకటనల సందచేయుటకిది సర్వోత్తమమైన మాధ్యమము.

విడిసంచిక 38 నయాపైసలు,
సాలుచందా రు. 1-50
ఇతర వివరములకు:
కార్యదర్శి,
భారతీయ కేంద్ర పొగాకుసమితి,
38, మౌంటురోడ్డు, మద్రాసు-6.

## టెండరు నోటీసు

ఈ దిగువ ఉదహరించిన ఎస్టిమేట్లకుగాను ది 6-3-1958 వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు తమిరిశ పంచాయతీ ఆఫీసులో సీలు వేసిన టెండర్లు కోరబడుచున్నవి. ధరావతు 100 కి 5 రూపాయలు చొ॥న చెల్లించవలయును. ఏవైన వివరములు కావలసినచో ఆఫీసువేళలయందు తెలుసుకొనవలయును.

1. మెరకుమాలపల్లిలోని మొఖరాల నర్సయ్యగారి ధర్మ చెరువు త్రవ్వుటకు; ఎస్టిమేటు మొత్తం రు 2000/- రు.
2. బండారు అంజనేయులు ఇంటి నుండి కాల్వవరకు గల బజారులో మట్టితోలి రిపేరు చేయుటకు; రు. 300/-
3. చర్చిమిషన్ స్కూలువద్దనుండి పడమరగా వున్న మెయిన్బజారు వరకు మట్టితోలి రిపేరుచేయుటకు; రు. 425/-
4. యిమ్మడిశేషయ్యగారి యింటి నుండి దక్షిణంగా చెర్వువరకు గల బజారులో మట్టితోలి రిపేరుచేయుటకు; రు. 450/-
5. కొమ్ముదాలపల్లి మెయిన్ బజారుకు మట్టితోలి రిపేరుచేయుటకు; రు. 480/-

బొప్పన రామమోహనరావు,
ప్రెసిడెంటు · తమిరిశ పంచాయితీ.

## సభలుసమావేశాలు

ఆంధ్ర టూరింగ్ సినిమా అసోసియేషన్ జనరల్బాడీ మీటింగు 2-3-58 తేదీ ఉదయం 10 గంటలకు సికింద్రాబాదులో 24 ఎ. ఆక్స్ఫర్డ్ వీధిలో జరుగుతుంది. టూరింగ్ సినిమా ఎగ్జిబిటర్లు అందరూ హాజరు కావలసినదిగా అసోసియేషన్ కార్యదర్శి శ్రీ యం. తాంజీరావుగారు ప్రకటిస్తున్నారు.

# లేఖలు

## బస్ చెకింగ్ ఇన్స్పెక్టర్లు

మహాశయా,

మోటారు వాహనముల చట్టంలో బస్ చెకింగ్ ఇన్స్పెక్టర్లకు సర్టిఫికెట్లు యిచ్చే నిబంధన లేకపోవడంవలన రవాణాశాఖాధికారులు అట్టి సర్టిఫికేట్లు యివ్వడంలేదు. అందువలన చెకింగ్ ఇన్స్పెక్టర్లను కూడా అప్పుడప్పుడు ప్రయాణీకులతో లెక్కగట్టి ఓవర్ లోడ్ కేసులు పెట్టడం సంభవించుతూంది. ఈ యిబ్బంది తొలగించుటకుగాను ప్రభుత్వ రోడ్ రవాణాశాఖవారు వెంటనే మోటారు వాహనాల చట్టంలో ఇట్టి అవకాశం యిస్తూ సవరణ చేయాలి. రాష్ట్రంలోని మోటారు కార్మిక సంఘాల వారందరు వారి వారి ప్రాంతాలలోని రవాణాశాఖాధికారులను కలుసుకొని వారి ద్వారా పై అధికారులకు కూడా విజ్ఞాపన పత్రాలు అందజేయడం అవసరం.

కె. వీరాచారి,
ఉపాధ్యక్షులు, గుంటూరుజిల్లా
మోటారు కార్మిక ఫెడరేషన్.

## నెల్లూరు పోలీసు అధికారి అక్రమ చర్యలు

మహాశయా,

నెల్లూరు డిప్యూటీ పోలీసు సూపరింటెండెంటు శ్రీ షేక్ అబ్దుల్ నబీసాహెబుగారు మోటారు కార్మికులపై చేయు దౌర్జన్యములకు అంతులేకుండా ఉంది. 1957 సెప్టెంబరు 7వ తేదీన ఎ.పి.డి. 951 నెంబరుగల లారీ క్లీనరు అగు యస్. ఫఖురుద్దీన్ అను అతను లారీవద్దర నిలబడి వున్నందుకు నీ డ్రైవరు ఎవడురా? అని అడుగుతూ ఆ క్లీనరు జవాబు చెప్పే లోపున లాఠీతో కొట్టి గాయపరచినారు.

అలాగే ఈ ఫిబ్రవరి 17 వ జిల్లా మోటార్ లేబర్ యూనియన్ మాజీ అధ్యక్షులైన శ్రీ యం. అచ్చయ్యగారు లారీని తీసుకొని కోవూరునుండి వస్తున్న సమయములో కోవూరు సినిమాహాలు దగ్గర జనసమూహములో డి. వై. యస్. పి గారి కారుకు సైడు ఇవ్వలేదని లారీని దాటి ముందుకు వచ్చిన లారీని ఆపమన్నారు. ఆ లారీని తోలుతున్న శ్రీ అచ్చయ్యగారు లారీని ఆపి 'నమస్కారము సార్' అని అంటుండే సమయంలో డి. వై. యస్. పి గారు శ్రీ అచ్చయ్యగారిని కొట్టి నానాబూతులు తిట్టుతూ, నీవు గడ్డము పెంచి వున్నందువల్ల నిన్ను వదలినాను. లేనిచో బూట్తో తన్ని వుండేవాడిని అని అసభ్యముగా మాట్లాడి శ్రీ అచ్చయ్యగారి మీద కేసులు బనాయించి అరెస్టు చేసి, లారీని కూడా తమ కస్టడీలోకి తీసుకుని మూడు రోజులు వుంచుకున్నారు. ఇందుపై జిల్లా మోటారు లేబరు యూనియన్ సర్వసభ్య సమావేశం వారు నిరసిస్తూ తీర్మానించారు కూడా. వీరి అధికార దుర్వినియోగం గురించి ప్రభుత్వం తగుచర్య తీసుకోవాలని కోరుతున్నాను.

వేలమూరు శ్రీనివాసరెడ్డి,
ప్రధాన కార్యదర్శి,
నెల్లూరుజిల్లా
మోటారు లేబర్ యూనియన్.

తెనాలి తాలూకా కమ్యూనిస్టు కమిటీ సమావేశం మార్చి 2, 3 తేదీలలో తెనాలిలో జరుగుతుంది. 2 వ తేదీ సాయంత్రం 1 గంటనుండి సమావేశం ప్రారంభమవుతుంది. 2వ తేదీ ఉదయం 8 గంటలనుండి సెక్రటేరియట్ సమావేశం జరుగును.

# తణుకు తాలూకాలో కలరా, మశూచి వ్యాధుల తీవ్రత

## కలరావల్లనే 40 మందికిపైగా మరణం

తణుకు, ఫిబ్రవరి 25

పశ్చిమగోదావరి జిల్లా తణుకు తాలూకాలోని అజ్జరం, గోటేరు, ఇరగవరం, కంతేరు, పెనుమంట్ర, పేకేరు, వర్తారామేశ్వరం, ఇలపర్రు, సిద్ధాంతం గ్రామాలలో కలరా, మశూచి వ్యాధులు తీవ్రంగా వున్నాయి. ఒక్క కలరావల్లనే 31 మంది చనిపోయారు.

వీరుకాక తణుకు ఒకటవవార్డులో ఇద్దరు, మూడవవార్డులో ఒకరు, అయిదవవార్డులో ఇద్దరు, ఆరవ వార్డులో ఒకరు, ఏడవవార్డులో ఒకరు, తొమ్మిదవ వార్డులో ఒకరు, పన్నెండవ వార్డులో ఒకరు మొత్తం 9 మంది కలరావల్ల చనిపోయారు. మరికొంత మందికి వ్యాధి సోకింది. అయినప్పటికి పంచాయితీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు.

కాల్దరి, వర్లూరు, అత్తిలిశివారు, కేసముద్రపుగట్టు, ఉరదాళపాలెం, పాలూరు, మొయ్యేరు, పాలమూరు, అజ్జరం, కాకరపర్రు, మల్లేశ్వరం గ్రామాలలో 14 మందికి మశూచి వ్యాధి సోకింది. ఇద్దరు చనిపోయారు.

తాలూకా ఆరోగ్యశాఖాధికారులు పై గ్రామాలలో టీకాలు వేస్తున్నారు. వీరు తాలూకాలో ఇంత వరకు ఏడువేల మందికి కలరా ఇంజెక్షన్లు ఇచ్చినట్లు తెలుస్తున్నది.

# ప్రాంతీయవార్తావళి

### నెల్లూరు

## నెల్లూరులో శ్రీ విఠలరావు గారి ప్రసంగం

నెల్లూరు, ఫిబ్రవరి 22

నెల్లూరులోని వివిధ ట్రేడ్ యూనియన్ ప్రతినిధులసమావేశం 18వ తేదీన జరిగింది. ఈ సమావేశానికి నెల్లూరు జిల్లా మోటారులేబరుయూనియన్ అధ్యక్షులు శ్రీసి.వి.నరశింహంగారు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో అఖిలభారత గని కార్మికుల సమాఖ్య అధ్యక్షుడు, అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు కోశాధికారి, పార్లమెంటు సభ్యుడూ అయిన శ్రీ టి. బి. విఠల్రావు గారు యిటీవల ఎర్నాకుళంలో జరిగిన అఖిల భారత ట్రేడ్యూనియన్ కాంగ్రెసు రజతోత్సవ మహాసభ నిర్ణయాల ప్రాముఖ్యతను వివరించారు. ఏ సంఘాలలోనూ చేరకుండా వున్న కార్మికుల నందరినీ ట్రేడ్ యూనియన్లలో చేర్పించవలసిందనీ కార్మికసంఘాలలో ఐక్యత, పెంపొందింప చేయవలసిందిగాను సలహా యిచ్చారు. శ్రీ పి. రామకోటయ్యగారి వందనసమర్పణతో సమావేశం ముగిసింది.

## బోగోలు - గుడ్లదొన రోడ్డుకు శంకుస్థాపన

జక్కేపల్లి గూడూరు, ఫిబ్రవరి 25

నెల్లూరుజిల్లా కావలి తాలూకాలో బోగోలు-గుడ్లదొన రోడ్డు నిర్మాణం మంజూరుఅయింది. ఈనెల 21వ తేదీన రోడ్డుకు శంకుస్థాపన చేశారు.

జక్కేపల్లి గూడూరు గ్రామ ప్రజానీకం, కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు, గ్రామ పెద్దలు ఈ కార్యక్రమంలో చాలా ఉత్సాహంగా పాల్గొన్నారు.

### అనంతపురం

## గుంతకల్లు జవుళిమిల్లు కార్మికుల కోర్కెలు

### మేనేజిమెంటు అంగీకారం

గుంతకల్లు, ఫిబ్రవరి 20

స్థానిక ఆంధ్ర కో - ఆపరేటివ్ స్పిన్నింగు మిల్లు ఐక్య కార్మిక సంఘ ప్రతినిధులు శ్రీ కే. ఆర్. వీరన్న, ఎ. దాసుగారలు ఈ నెల మొదటి వారంలో మిల్లు జనరలు మేనేజరు శ్రీ కె. నారాయణాచార్యులను కలుసుకొని సంప్రదింపులు జరిపిన ఫలితంగా దిగువ కోర్కెలను అంగీకరించి అమలు జరుపుటకు ఉత్తర్వులుచేశారు.

రీలింగు డిపార్టుమెంటు స్త్రీల సెక్షన్లో కాలీలు వున్నవాటిని బోండా పిక్కర్సును ఖాయం చేయాలన్న కోర్కెను ఆమోదించి ఎనిమిది కాళీలకు బోండా పిక్కర్లను మార్చుతూ ఉత్తర్వులు చేశారు.

రీలింగు డిపార్టుమెంటులోవున్న మగవారిని ఇంటరులోనికి మార్చాలని ప్రతినిధులు కోరగా అగ్గురు మగ రీలర్లను ఇంటరులోనికి మార్చుతూ ఉత్తర్వులు చేశారు.

ఇంటరు డిపార్టుమెంటులో వెంటర్సు కాళీలను భర్తీచేయాలని కోరగా తొమ్మిది కాళీలను భర్తీ చేయడానికి ఉత్తర్వులు చేశారు.

## రైల్వేకార్మికుల నిరసన ప్రదర్శన

గుంతకల్లు రైల్వే టి. పి. షెడ్డులో పనిచేయు కార్మికులు 500 మంది ఫ్లీట్ ట్రాన్స్పోర్టు ఆఫీసరు శ్రీరామమూర్తి అక్రమాలకు వ్యతిరేకంగా నిరసన తెలియజేస్తూ ఈ నెల 15 వ తేదీన పెద్ద ఊరేగింపు జరిపారు. ఊరేగింపు తరువాత బెంచికోట్లలలో బహిరంగసభ జరిగింది.

# సత్తెనపల్లితాలూకా బంజరు సాగుదార్లకు అన్యాయం

## వ్యయప్రయాసలతో సాగుచేసినభూమి రాజకీయ బాధితులకు దఖలు

సత్తెనపల్లి, ఫిబ్రవరి 24

సత్తెనపల్లితాలూకాలో వ్యవసాయ కూలీలు ఎన్నో వ్యయప్రయాసలు పడి రెండువేల ఎకరాల ఫారెస్టుబంజరును సాగులోకి తెస్తే ఆభూమిని ప్రభుత్వం రాజకీయబాధితులకు పంటలతోసహా దఖలుపరచిందనీ ఈ అన్యాయాన్ని విడనాడి సాగుదార్లకే భూములను యివ్వాలని తాలూకా కూలీసంఘం ఆర్గనైజరు శ్రీ పాములపాటి యల్లమంద ఒక విజ్ఞప్తిచేశారు. విజ్ఞప్తిలో ఇలా తెలియజేశారు.

సత్తెనపల్లి తాలూకాలో షుమారు 15 సంవత్సరాల నుండి బోధనం, కందిపాడు (రాయుడుపాలెం) పెదనెమలిపురి, బీరవల్లిపాయి, కామేపల్లి మొదలగు గ్రామీణ వ్యవసాయ కూలీలు అనేక కష్టనష్టాల కోర్చి ఫారెస్టు బంజరుకు 2000 ఎకరాలను సాగుజేశారు. ఈ భూములను రాజకీయ బాధితులకు యివ్వాలని ఉమ్మడి మద్రాసు ప్రభుత్వం ప్రయత్నించింది. ఈ విషయంలో సాగుదార్లు తీవ్రమైన ఆందోళన చేయడం వలన రాజకీయ బాధితులకు ఆ భూములు యివ్వటం మానుకొన్నారు.

కాని తిరిగి రెండు సంవత్సరాలు గడిచిన తరువాత రాయిడుపాలెం, బోధనం, పెదనెమలిపురి, బీరవల్లిపాయ, కామేపల్లి మొదలగు చోట్ల ఫారెస్టు బంజర్లలో ప్లాన్టేషన్ (ముళ్ళచెట్లు) పద్ధతిని ప్రవేశపెట్టారు. ఈపద్ధతివలన ఆ భూములు సాగుచేయ వీలుపడలేదు. వెంటనే సాగుదార్లు యీ ప్లాన్టేషన్కు వ్యతిరేకంగా ఆందోళనచేసి ఆ భూములు తమకు పట్టాలు యివ్వాలనీ ఆంధ్ర ప్రభుత్వానికి మహాసభలద్వారా మహజర్లద్వారా తెలియజేశారు. 1955 లో బోధనం సాగుదార్లు భూములనుగురించి సత్యాగ్రహం చేశారు. కాని ప్రభుత్వంవారు భూములివ్వడంబదులు సాగుదార్లను అరెస్టు చేశారు. ఈభూములు సాగుచేయవీలు లేదని, ఫారెస్టు అభివృద్ధికి యీ భూములు వదిలిపెట్టామని తెలియజేసినారు.

అదేవిధంగా రాయుడు పాలెం ఫారెస్టుబంజరు 330 ఎకరాలను కందిపాడు, కొండూరు, నిండుజర్ల, డొక్లేరు మొదలగు గ్రామాల వ్యవసాయకూలీలు సాగు చేస్తుంటే ఈసాగుదార్లపై రు 25 వేల రూపాయల పెనాల్టీలను ప్రభుత్వం విధించింది. అదికట్టకపోతే అధికారులు చెంబులు తప్పాలా వేలం వేసారు కూడా. చివరకు ఆపైర్లు పశువులుతోలి మేపటం వగైరాలు చేశారు. చివరకు ఈ భూములను రాజకీయ బాధితులకు యిచ్చారు. వెంటనే సాగుదార్లను భూములనుండి వెళ్ళిపొమ్మని నోటీసులు జారీచేశారు. అందులో నున్న పంటలు సైతం రాజకీయ బాధితులకు దఖలుపర్చారు. ఆరుగాలం చాకిరి చేసి పండించుతున్న పంటలు యివ్వటానికి వీలుపడదని సాగుదార్లు అంటే సాగుదార్లపై రాజకీయ బాధితులు కేసులుకూడా పెట్టారు. ఇప్పటికి యింకా అయిదుగురు మీద కేసులు నడుస్తూనే ఉన్నాయి.

ఫారెస్టుఅభివృద్ధిపేరుతో బోధనం, పెదనెమలిపురి, బీరవల్లిపాయ, కామేపల్లి మొదలగు సాగుదార్లను భూములనుండి వెళ్లగొట్టి రాయిడుపాలెం ఫారెస్టు బంజరు రాజకీయబాధితులకు విడగొట్టి పట్టాలు యివ్వటం ఎంత అన్యాయమో, ఎలాంటి ప్రజావ్యతిరేక విధానమో స్పష్టం. పై గ్రామాలకు వర్తించిన ఫారెస్టు అభివృద్ధిపట్టం యిక్కడ వర్తింపచేయక పోవటంలో ప్రభుత్వ పక్షపాతబుద్ధి ప్రస్ఫుటంగానే గోచరించుతోంది. ప్రభుత్వంవారు భూసంస్కరణలు అమలుజరుపుతామని పదేపదే చెబుతున్నారు. కాని ఆచరణలో అందుకు విరుద్ధంగా చేస్తున్నారు. నిరుపేదలైన వ్యవసాయకూలీలు తమ భార్యల మెడలలో మంగళసూత్రములు సైతం అమ్మి ఎన్నో వ్యయప్రయాసలకులోనై సాగుజేసి ఫలసాయానికి తెచ్చిన యీ బంజరుభూములు రాజకీయ బాధితులకు యివ్వటం ఎలాంటి సోషలిజమో వారే చెప్పాలి.

ఈ విషయంలో అన్ని రాజకీయ పార్టీలవారు ప్రజాస్వామ్యవాదులు ఏకమై ప్రభుత్వ ప్రజావ్యతిరేక పద్ధతులను ఖండించాలనీ, సాగుదార్లకు న్యాయం జరిగేటట్లు చూడాలనీ కోరుతున్నాను.

### కర్నూలు

## దూదేకొండ పంచాయితీ ఎన్నికలు

ఆదోని, ఫిబ్రవరి 24

కర్నూలుజిల్లా పత్తికొండతాలూకా దూదేకొండ మైనర్ పంచాయితీ ఎన్నికలలోఆరుస్థానాలకుకమ్యూనిస్టుపార్టీ, పార్టీ బలపరచిన అభ్యర్థులు పోటీ లేకుండా ఏకగ్రీవంగా ఎన్నికైనారు.

వారి పేర్లు ఇవి: శ్రీయుతులు పి. ఎస్. చక్రప్ప, కె. నారప్ప, ఎం. నారప్ప, చిన్న రంగప్ప, చిన్న సిద్ధిసాహెబ్, ఈడిగ రంగయ్య.

మరొక స్థానానికి స్వతంత్ర అభ్యర్థి శ్రీ బి. శంకరరెడ్డిని ఎన్నుకొన్నారు.

పంచాయితీ అధ్యక్షుడుగా శ్రీ ఎం. నారప్ప ఏకగ్రీవంగా ఎన్నికైనారు.

### గుంటూరు

## చీరాల రిక్షా కార్మికసంఘం

చీరాల, ఫిబ్రవరి 20

చీరాల రిక్షా కార్మికులు చీరాల పేరాలలో ఇటీవల పెద్ద ఊరేగింపు, సభ జరిపి జాండ్రపేట, వేటపాలెం, పందిళ్ళపల్లి వెళ్ళేటప్పుడు వసూలు చేస్తున్న టోల్ గేట్ పన్నును రద్దు చేయాలని ఆయా పంచాయితీలను కోరారు. ఇద్దరు ప్రయాణీకులను తీసుకొనిపోడానికి అనుమతి కోరారు. నూతన కార్యవర్గానికి అధ్యక్షులుగా శ్రీ రొమ్మిపల్లి వెంకటేశ్వరరావుగారిని, శ్రీ యూసఫ్ఖాన్ను కార్యదర్శిగాను, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

## మైసూరు ప్రభుత్వ విధానాలకు నిరసన

### కమ్యూనిస్టుపార్టీ ఆధ్వర్యాన సభలు, సమావేశాలు

మంగుళూరు, ఫిబ్రవరి 28

మైసూరు ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ కమ్యూనిస్టుపార్టీ ఆధ్వర్యాన నేడు రాష్ట్రమంతటా నిరసనదినం జరిగారు.

ఈ నిరసనదినం జరపాలని రాష్ట్ర కమ్యూనిస్టు మహాసభలో లోగడ తీర్మానించారు.

సమగ్ర భూసంస్కరణలను ప్రవేశపెట్టాలని, భూములకు గరిష్ఠ పరిమితులు పెట్టాలని నినాదాలు చేస్తూ ప్రజలు ఊరేగింపులు చేశారు· సభలు జరిపారు.

సభల్లో తొలుత మౌలానా ఆజాద్ మృతికి, బొగ్గుగని ప్రమాదాల్లో కార్మికుల మృతికి సంతాపం తెల్పుతూ తీర్మానాలు చేశారు.

## ఆజాద్కు గుంటూరు మైలర్సు జోహార్లు

గుంటూరు పట్టణంలోని మైలర్లు అబుల్కలాం ఆజాద్ నిర్యాణ వార్త వినినంతనే తమ పనులన్నీ మానివేసి, హర్తాళ్ జరిపారు. సాయంకాలం శ్రీ జాలయ్యగారి మార్కెట్టులో సయ్యద్ గాలిబ్ సాహెబ్గారి అధ్యక్షతను సమావేశమై ఆజాద్ ఆత్మశాంతికోసం ప్రార్థనలు జరిపారు. ఒక గొప్ప భాషాపండితుని కోల్పోయినందుకు విచారం తెలియచేస్తూ పండితనెహ్రూకు టెలిగ్రాం పంపించారు.

## టెండరు నోటీసు

గుంటూరు తాలూకా శాఖమూరు పంచాయితీ తాలూకు యీదిగువ నుదహరించిన పనులు చేయుటకు సీలువేయబడిన టెండర్లు 1-3-58 తేదీ సా॥ 4 గంటల వరకు సదరు పంచాయితీ ప్రెసిడెంటుగారిచే తీసుకొనబడి ఆరోజు సా॥ 5 గంటలకు ఆఫీసువద్ద పరిష్కరించబడును. అభిలాషగలవారు నిర్ణీతమైన ధరావతు ముందుగా చెల్లించి టెండర్ల దాఖలు చేయవచ్చును. యితర వివరములు పంచాయితీ ఆఫీసువద్ద తెలుసుకొన వచ్చును.

| పనిపేరు | ఎస్టిమేటు మొత్తం | ధరావత్తు |
|---|---|---|
| 1. మంచినీళ్ల చెర్వువాగుకు వుత్తరదిశ డొంకలో మట్టిరోడ్డు వేయుట. | 980/- | 47/- |
| 2. మంచినీళ్ల చెర్వులోతుచేసి గట్టుమెరక, వెడల్పు చేయుట. | 2000/- | 100/- |
| 3. డిటో చెర్వు తాలూకు కళింగల మరమ్మతు. | 2000/- | 100/- |
| 4. డిటో చెర్వుకు మాలపల్లిరేవులో మెట్లుకట్టుట. | 1400/- | 70/- |
| 5. డిటో గ్రామరేవులో మెట్లుకట్టుట. | 1400/- | 70/- |

ది 21-2-58
శాఖమూరు.

(సం) కాకుమాను నరసింహ్వారావు,
ప్రెసిడెంటు, శాఖమూరు పంచాయితీ.



మీ బిడ్డకు అందమైన దుస్తులే తొడగవచ్చును!

అందమైన డిజైనులు, అద్భుతమైన రంగులు, ఇవి తక్కువ ధరగల నూలు బట్టలలో దొరుకుతాయంటే మీరెంతకి నమ్మజాలరు. మీరు రెడిమేడ్ - ప్రింటు బట్టలు కొన్నపుడు, సరిగ్గా మీకు అటువంటివే దొరకుతాయి ఇవి మున్నితమైనవి వీటి ధరయే తక్కువ. [illegible] మీకు రవికెలకు, లంగాలకు మరియు మీ పిల్లల దరిందరానికి కావలసిన బట్టలు కూడా యివే.

నాణ్యమైన చీరలు, పంచెలు మరియు ప్రింట్లు.

జహంగీర్ వకీల్ మిల్సు కంపెనీ లిమిటెడ్
అహమ్మదాబాద్

వివరములకు యీ దిగువవారిని అహమ్మదాబా[illegible] హర్బెట్ వద్ద చూడండి
1 చునీలాల్ చందన్మల్ 2 చిరిపకుమార్ [illegible]లాల్ 3 మిత్రమల్ అశోకకుమార్ 4 కేశవ్లాల్ టోకాలాల్ 5 కాంతిలాల్ లాల్భాయ్

# హిందూస్థాన్ విమాన ఫ్యాక్టరీ కార్మికులపై పోలీసు కాల్పులు

## ఒకరి మరణం, పెక్కుమందికి గాయాలు

బెంగుళూరు, ఫిబ్రవరి 25

బెంగుళూరులోని హిందూస్థాన్ విమాన ఫ్యాక్టరీ కార్మికులపై పోలీసులు నేడు తుపాకి కాల్పులు జరిపారు. కాల్పుల ఫలితంగా ఒక కార్మికుడు మరణించాడు 25 మంది గాయపడ్డారు అయిదుసార్లు కాల్చారు. కార్మికులపై రెండుసార్లు లాఠీ చార్జీలుకూడా జరిపారు.

గత రెండు దినాలుగా ఈ ఫ్యాక్టరీ కార్మికులు బైఠాయింపు సమ్మె సాగిస్తున్నారు.

సమ్మెదారులు ఒక పోలీసు జీపును చుట్టుముట్టారనీ, అందులోని పోలీసు అధికారిపై చేయి చేసుకోడానికి సిద్ధపడ్డారనీ, దానిమీదట కాల్పులు జరప వలసి వచ్చిందని పోలీసువారంటున్నారు. కాల్పుల్లో ఒకనికి మాత్రమే గుండుదెబ్బ తగిలిందని పోలీసులు అంటున్నారు. [illegible] కార్మికుడు [illegible] మరణించాడు.

ఈవేళ మధ్యాహ్నంనుండి బెంగుళూరులో సభలపైన, ప్రదర్శనలపైన నిషేధం అమలు జరిపారు.

ఈ నిషేధాన్ని ఉల్లంఘించి సభ జరపదలచారని చెప్పి ఒకసారి ఫ్యాక్టరీ సమీపంలోనూ, మరొకసారి నగరంలోనూ కార్మికులపై లాఠీచార్జీలు జరిపారు. ఈ లాఠీచార్జీలో ఎంతమందికి దెబ్బలు తగిలాయో తెలియదు. కార్మికులు రాళ్ళు విసిరారనీ, గాయపడిన 25 మందిలో పోలీసులుకూడా ఉన్నారని అధికారులంటున్నారు.

ఇరవై అయిదుమంది ఈ సందర్భంలో అరెస్టయ్యారు.

ఈ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న మొత్తం 4000 మంది కార్మికులూ బైఠాయింపు సమ్మెలో పాల్గొంటున్నారు. ఈవేళ సాయంత్రం మొదటి షిఫ్ట్ వేళ అయిపోగానే వీరంతా ఫ్యాక్టరీ వెలుపలికి వచ్చి, పెద్ద ప్రదర్శనం చేయతలపెట్టారనీ, నిషేధం ఉంది కాబట్టి అదికూడదని చెప్పిన పోలీసు అధికారులపై తిరగబడ్డానికి ప్రయత్నించారనీ, దానిమీదట డిప్యూటీ సూపరింటెండెంటు కాల్పులకు ఉత్తరువిచ్చారనీ అధికారులు అంటున్నారు.

కార్మికులను గురించి ఫ్యాక్టరీ అధికారుల ప్రతినిధి పి.టి.ఐ. విలేఖరితో మాట్లాడుతూ మొదటి షిఫ్ట్‌కు చెందినవారు చాల ఉద్రేకంతో ఉన్నారనీ, రెండవ షిఫ్ట్‌వారు పైకిమాత్రం నిదానంగా ఉన్నట్లు కనబడుతున్నారనీ అన్నారు.

# పఠాన్‌కోట ప్రమాదం

## విచారణ జరిపేందుకు ప్రభుత్వ నిర్ణయం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25

పఠాన్‌కోట దుస్సంఘటనను గురించి న్యాయ విచారణ జరిపించడానికి ప్రభుత్వం నిర్ణయించిందని రక్షణశాఖ మంత్రి శ్రీ వి. కె. కృష్ణమీనన్ నేడు లోక్‌సభలో ప్రకటించారు.

ఈవేళ ఉదయం ఆయన పఠాన్‌కోటకు వెళ్ళి ప్రమాదం జరిగిన చోటును స్వయంగా పరిశీలించివచ్చారు. చనిపోయిన, గాయపడిన వారి కుటుంబాలకు సాధ్యమయినంత ఆర్థికసహాయం అందజేయవలసిందిగా సైనికోద్యోగులను ఆదేశించారు.

ప్రమాదంగురించి ఆయన లోక్‌సభలో ఈ క్రింది వివరాలు తెలిపారు:

18 మంది సివిలియన్లు, ఎనిమిది మంది సైనికులు చనిపోయారని ఇంతవరకు తేలింది. ఒక సివిలియన్ ఉద్యోగి, ఎనిమిదిమంది సైనికులూ, ఒక సైనికుని కుటుంబానికి చెందిన వ్యక్తి గాయపడ్డారు. 28 మంది సివిలియన్ ఉద్యోగుల జాడ తెలియదు. వీరిలో ఎంతమంది చనిపోయి వుంటారో తెలియదు. ఇంకా వివరాలు అందితే వాటిని సభవారికి తెలుపుతాము.

పఠాన్‌కోట సైనిక ప్లాట్‌ఫారం మీద ఆరు రైలుపెట్టెల్లోనుండి మందుగుండు సామగ్రిని దించడం ప్రారంభించారు. కొద్దిసేపట్లోనే ప్రేలుడు జరిగింది. రెండు పెట్టెలు పూర్తిగా ప్రేలిపోయాయి. మరి మూడు బాగా దెబ్బతిన్నాయి. ఆరవదానికి ఆస్తినష్టం కలగనట్లు ఇప్పటికి అనిపిస్తూ ఉంది.

ప్రేలిపోయిన పెట్టెల తునకలు చుట్టూ వేయి గజాల దూరంవరకు ఎగిరిపడ్డాయి. పఠాన్‌కోటకు 23 మైళ్ళ దూరంలో ఉన్న గురుదాస్పూరులో కూడా ఈ ప్రేలుడు వినిపించింది.

ప్రేలుడువల్ల బయలుదేరిన మంటలు [illegible] సామగ్రిని ధ్వంసం చేశాయి.

అక్కడ కొన్ని రైలు రాకపోకలను ప్రస్తుతానికి ఆపివేశారు.

చనిపోయినవారిలో ఇద్దరు సైనికుల కుటుంబాలు మాత్రమే పఠాన్‌కోటలో ఉన్నాయి. వాటికి చెరొక మూడువందల రూపాయలు ఇచ్చారు. తక్కినవారి కుటుంబాలు ఎక్కడెక్కడున్నాయో సమాచారం సేకరిస్తున్నారు. చనిపోయిన సైనికుల కుటుంబాలకు పింఛనులు మొదలైన వాటినిగురించి వెంటనే తగుచర్యలు తీసుకుంటున్నాము. చనిపోయిన సివిలియన్ల కుటుంబాలకు కూడా తగు ఆర్థిక సహాయాన్ని వెంటనే అందజేసే ఏర్పాట్లు జరుగుతున్నాయి.

ప్రాణనష్టం, ఆస్తినష్టం గురించి పూర్తి అంచనాకట్టడం ఇంకా సాధ్యం కాదు. అలాగే ప్రేలుడుకు కారణం ఏమిటోకూడాచెప్పడం సాధ్యంకాదు.

చనిపోయిన సైనికులకూ, సివిలియన్లకూ ప్రభుత్వం జోహారులర్పిస్తోంది. వారి కుటుంబాలకు ప్రభుత్వమూ, సభవారూ హృదయపూర్వక సానుతాపం తెలుపుతున్నారు.

సైనిక నిబంధనలను అనుసరించి ఈ ప్రమాదం విషయమై విచారణ కోర్టును ఏర్పాటు చేశాము.

ఈ ప్రమాదం గురించి ఒక సభ్యుడు నోటీసిచ్చిన వాయిదా తీర్మానాన్ని, కృష్ణమీనన్ ప్రకటన విన్న మీదట స్పీకర్ శ్రీ అనంతశయనం అయ్యంగారు త్రోసివేశారు

# ఓడిపోయిన యు. పి. మంత్రి శ్రీ గుప్త తిరిగి శాసనసభకు పోటీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24

ఉత్తరప్రదేశ్ మాజీమంత్రి శ్రీ సి. బి. గుప్త ఒక ఉప ఎన్నికలో రాష్ట్రశాసనసభకు పోటీచేస్తున్నారు.

శ్రీ గుప్త ఉత్తరప్రదేశ్ కాంగ్రెసులో కీలకవ్యక్తిగా పేరుపొందారు. క్రిందటి జనరల్ ఎన్నికల్లో ప్ర. సో. పార్టీ అభ్యర్థి చేతిలో ఓడిపోయారు. అప్పటినుండి మరల శాసనసభలో ప్రవేశించడానికి ఆయన ప్రయత్నం చేస్తూనేవున్నారు.

ఇప్పుడు [illegible] నియోజకవర్గానికి సంబంధించిన శాసనసభ్యుని ఎన్నికను ఎన్నికల ట్రిబ్యునల్ రద్దుచేయడం వలన ఆ ఖాళీస్థానానికి పోటీ చేయడానికి సిద్ధపడ్డారు. ఆయన అభ్యర్థిత్వాన్ని కేంద్ర కాంగ్రెసు పార్లమెంటరీబోర్డు అంగీకరించింది.

# కడపజిల్లాలోని ఒక గ్రామంలో తుపాకి కాల్పులు

హైద్రాబాద్, ఫిబ్రవరి 25

కడపజిల్లా ప్రొద్దుటూరు తాలూకాలోని సర్వాయపేటలో ఫిబ్రవరి 23 వ తేదీన పోలీసులు తుపాకీలు పేల్చినట్లు నేడిక్కడకు వర్తమానం చేరింది. గ్రామ పార్టీల కీచులాటల సందర్భంలో ఈ కాల్పులు జరిగినట్లు తెలుస్తోంది. (వి. వి.)

* * *

మౌలానా ఆజాద్ మరణానికి సంతాపం తెలుపుతూ బ్రిటిష్ ప్రధాన మంత్రి శ్రీ నెహ్రూకు సందేశం పంపారు.

# సినిమాహాల్లో సిగరెట్లు కాల్చేవారికి శిక్షలు

హైద్రాబాద్, ఫిబ్రవరి 25

సినిమాహాల్లో సిగరెట్లు కాలిస్తే, హాలు యజమానులను కాకుండా, సిగరెట్లు కాల్చేవారిని శిక్షించే శాసనం తెలంగాణా ప్రాంతాల్లో అమలులో ఉంది. ఆంధ్ర, తెలంగాణా ప్రాంతాల్లో ఇందుకు సంబంధించిన చట్టాలను సమ్మిళితం చేసేటప్పుడు, తెలంగాణా ప్రాంతాల్లో ఉన్న ఈ చట్టాన్నే ఆంధ్ర ప్రాంతంలో కూడా అమలు జరుపుతామని, శ్రీ వెల్లంకి విశ్వేశ్వరరావుగారు (పి. డి. యఫ్. కమ్యూనిస్టు) అడిగిన ఒక ప్రశ్నకు జవాబుచెబుతూ హోంమంత్రిగారు తెలిపారు.

# ధవళేశ్వరం పి. డబ్ల్యు. డి. వర్కు షాపులో అవినీతి

హైద్రాబాద్, ఫిబ్రవరి 25

ధవళేశ్వరం పి. డబ్ల్యు. డి. వర్కు షాపులో అవినీతినిగురించి శ్రీ గంజి నాగేశ్వరరావుగారు ఫిర్యాదు చేసిన విషయం నేడు ఆంధ్ర శాసనసభలో ఇరిగేషన్ మంత్రిగారు ఒప్పుకున్నారు. ఈ విషయమై దర్యాప్తు ఆలస్య మవుతున్నదని కూడా ఆయన తెలిపారన్నారు. దీనిని గురించి ఆలోచిస్తామన్నారు.

# మధిర వర్తకసంఘ సానుభూతి

మధిర వర్తక సంఘంవారు సమావేశమై, ఆజాద్ మృతికి సంతాపం వెల్లడిస్తూ తీర్మానించారు. ఆయన ఆత్మశాంతికై రెండునిముషాలు మౌనం వహించారు.

# అనకాపల్లి బాలానంద సంఘం జోహార్లు

ఆజాద్‌కు జోహార్లు అర్పిస్తూ అనకాపల్లి రామా బాలానందసంఘం వారు తీర్మానించారు.

# అబ్దుల్లా పత్తాసు దారుల ఇంటిలో ఆయుధాలు

శ్రీనగర్, ఫిబ్రవరి 25

షేక్ అబ్దుల్లాను బలపరుస్తూన్న కాశ్మీర్ ప్లెబిసైట్ ఫ్రంటు ప్రధాన కార్యదర్శి గులామ్ మొహియుద్దీన్ హందాని ఇంటిని సోదాచేయగా ఒక రివాల్వరూ, నలభై తోటాలూ దొరికాయి. అతనినీ, ఆ సంస్థ తాత్కాలికాధ్యక్షుడు సూఫీ మహమద్ అక్బర్‌నీ, మాజీ అధ్యక్షుడు నాయబ్‌దీన్‌ని పోలీసులు అరెస్టుచేశారు. మొన్నటి అల్లర్ల సందర్భంలో ఈ అరెస్టులు జరిగాయి.

# కొత్తగూడెం గనిలో మంటలు చల్లారాయి

కొత్తగూడెం, ఫిబ్రవరి 25

ఆదివారం మంటలు బయలుదేరిన సింగరేణి బొగ్గుగనిలో మంటలూ, పొగా ఈవేళ ఉదయానికి పూర్తిగా తగ్గిపోయాయి. ఆ గనిని అధికారులు ఈవేళ తెరిచి తనిఖీ చేశారు. పనివారు అందులోకి ప్రవేశించేందుకు అనుకూల పరిస్థితి ఏర్పడింది. గనిలో ఉన్న సామగ్రినంతా బయటికి తెచ్చే ఏర్పాట్లు చేస్తున్నారు.

# హిందూస్థాన్ విమాన ఫ్యాక్టరీ లాకౌట్

బెంగుళూరు, ఫిబ్రవరి 25

ప్రభుత్వ ఆధీనంలోవున్న హిందూస్థాన్ విమాన ఫ్యాక్టరీలో అధికారులు ఈవేళ అర్ధరాత్రినుండి లాకౌట్ ప్రకటించారు.

# ఆర్జెంటీనా ఎన్నికల ఫలితాలు

## రాడికల్ పార్టీ విజయం

బ్యూనాస్ ఎయిర్స్, ఫిబ్రవరి 24

ఆర్జెంటీనాలో నిన్న జరిగిన జనరల్ ఎన్నికల ఫలితాలు ఈవేళ ప్రకటిత మయ్యాయి.

డాక్టరు ఆర్టురో ఫ్రాండిజీ ఆర్జెంటీనా అధ్యక్షుడుగా ఎన్నికయ్యారు. ఆయన రాడికల్ పార్టీ నాయకుడు.

పార్లమెంటుకుకూడా రాడికల్ పార్టీ సభ్యులే హెచ్చుమంది ఎన్నికయ్యారు. డాక్టరు ఆర్టురో ఆరు సంవత్సరాలపాటు అధ్యక్ష పదవిలో వుంటారు.

ప్రజలందరికి పూర్తి ప్రజాతంత్ర హక్కులను కల్గిస్తామని రాడికల్ పార్టీ ఎన్నికలలో ప్రజలకు వాగ్దానం చేసింది.

రాడికల్ పార్టీ విజయం పొందినందుకు మాజీ అధ్యక్షుడు పెరోన్ అనుచరులు ఎంతగానో సంతోషిస్తున్నారు.

# ఆయుర్వేదానికి ప్రభుత్వప్రోత్సాహం

## కేంద్రమంత్రి వాగ్దానం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25

ఆయుర్వేదం, తదితర భారతీయ వైద్యవిధానాలను ప్రోత్సహించడం భారతప్రభుత్వ విధానమని నేడు ఆరోగ్యశాఖామంత్రి శ్రీ డి. పి. కర్మార్కర్ లోక్‌సభలో ఒకప్రశ్నకు సమాధానంగా తెలియజేశారు.

భారతీయ వైద్యానికి సంబంధించిన సంస్థలకు ఆర్థిక సహాయం చేయడం, పరిశోధనలను ప్రోత్సహించి, అందుకు అవసరమైన నిధులను సమకూర్చడం ప్రభుత్వం తన విధిగా వుంచుకొన్నదనీ, అయితే తాము మంజూరు చేసే ధనాన్ని సక్రమంగా వినియోగించుకొనే వారు ముందుకు రాకపోవడం అత్యంత శోచనీయమైన విషయమనీ శ్రీ కర్మార్కర్ అన్నారు.

# జపాన్‌కు ముడి ఇనుము ఎగుమతి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25

జపానుకు ఎగుమతి చేయబోయే ముడి ఇనుము ధరలను నిర్ణయించుకొనేందుకుగాను త్వరలోనే ఒక జపాన్ ప్రతినిధివర్గం మనదేశానికి రానున్నదని రవాణాశాఖా ఉప మంత్రి శ్రీ షానవాజ్ ఖాన్ నేడు లోక్‌సభలో తెలియజేశారు.

తమ దేశానికి ముడి ఇనుమును ఎగుమతి చేసుకొనే విషయమై ఇంతకు ముందు ఒకసారి జపాన్ ప్రతినిధివర్గం మనదేశం వచ్చిందని, వారు సమర్పించిన నివేదికను భారత ప్రభుత్వం పరిశీలించుతున్నదనికూడా శ్రీ షానవాజ్ ఖాన్ తెలిపారు. వారు సమర్పించిన నివేదికలో విశాఖ రేవునుండి ఎగుమతి చేయడానికిగల అవకాశాలను వివరించారు.

# భారతదేశానికి వ్యాపారనౌకలు

## హెచ్చుగా సంపాదించుకోవాలని లోక్‌సభలో సూచనలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25

ద్వితీయప్రణాళికాకాలం పూర్తి అయ్యేసరికి తొమ్మిదిలక్షల టన్నులను రవాణాచేయగల నౌకలను సంపాదించాలని లక్ష్యంగా పెట్టుకొన్నామనీ, ఆ లక్ష్యాన్ని పూర్తిచేయడమేగాక మించిపోగలమనే విశ్వాసం కూడా తనకుగలదని రవాణాశాఖ మంత్రి శ్రీ లాల్‌బహదూర్ శాస్త్రి తెలిపారు.

వ్యాపార నౌకలకు సంబంధించిన నిబంధనలను క్రోడీకరించడానికి ప్రవేశపెట్టబడిన షిప్పింగ్ బిల్లుపై లోక్‌సభలో చర్చ జరిగిన సందర్భంలో మంత్రి ఈ విషయాన్ని తెలిపారు.

బిల్లును పార్లమెంటు ఉభయసభల సంయుక్త కమిటీకి పంపడానికి సభవారు ఆమోదించారు.

బిల్లును అన్ని పక్షాలవారు బలపరిచారు. మనదేశానికి ఎక్కువ నౌకలను సంపాదించవలసిన ఆవశ్యకతను గురించి పలువురు సభ్యులు సూచనలు చేశారు.

రవాణాశాఖమంత్రి శ్రీ లాల్‌బహదూర్ శాస్త్రి చర్చకు జవాబుచెబుతూ కొత్త నౌకలను, కొంతవరకు ఉపయోగించబడిన నౌకలను కొనడానికి ఇప్పుడు పరిస్థితులు అనుకూలంగా వున్నాయన్నారు. జపాన్‌నుండి కనీసం అరవైశాతం నౌకలను, వారిచ్చే అప్పునుంచే కొనడానికి అవకాశం గలదన్నారు.

# మార్చి 27 న దేశమంతా కార్మిక "కోర్కెలదినం" జరపండి

## వివిధ కార్మికసంఘాల సంయుక్త విజ్ఞప్తి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25

భారతదేశంలోని కార్మికులంతా మార్చి 27 వ తేదీని "కోర్కెలదినం"గా పరిగణించి, ఆ రోజున ముఖ్య పట్టణాలన్నింటిలోను ప్రదర్శనలను జరపాలని వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు నేడిక్కడ సమావేశమై తీర్మానించారు.

మార్చి 27 వ తేదీన దేశమంతటా కార్మికులు తమ "కోర్కెలపత్రాలను" ప్రభుత్వానికి అందచేయాలని ఆ తీర్మానంలో పేర్కొన్నారు.

ఈవేళ ఢిల్లీలో హింద్ మజ్దూర్ సభ, అఖిలభారత ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు, అఖిలభారత రైల్వేమెన్స్ ఫెడరేషన్, అఖిలభారత డిఫెన్స్ ఉద్యోగుల సమాఖ్య, కేంద్ర ప్రభుత్వోద్యోగులసంఘాల సమాఖ్య, అఖిలభారత రేవు కార్మికుల సమాఖ్య, అఖిలభారత పంచదార కార్మికుల సమాఖ్య, అఖిలభారత బ్యాంకు ఉద్యోగుల సంఘం ప్రతినిధులు సమావేశమై, పై నిర్ణయం చేశారు.

"కోర్కెలదినం" జరపటానికి సంబంధించిన కార్యక్రమాన్ని రూపొందించే నిమిత్తమూ, 'కోర్కెల దినం' జరిపిన అనంతరం తీసుకోవలసిన చర్యలను నిర్ణయించేందుకూ ఒక కార్యాచరణ సంఘాన్ని కూడా ఈవేళ సమావేశంలో ఎన్నుకొన్నారు.

ఈ కార్యాచరణ సంఘంలో శ్రీ ఆంథోనిపిళ్ళె (హింద్ మజ్దూర్ సభ), శ్రీ ఎస్. ఏ. డాంగే (అఖిల భారత ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్), శ్రీ నాథ్‌పాయ్ (కేంద్ర ప్రభుత్వోద్యోగుల సమాఖ్య), శ్రీ ఎస్. ఎమ్. బెనర్జీ (డిఫెన్స్ ఉద్యోగుల సమాఖ్య), పీటర్ ఆల్వారిస్ (రైల్వే కార్మిక సమాఖ్య), పి. డి. మెల్లో (రేవు కార్మికుల సమాఖ్య), బి. ఎన్. ఘోష్ (తంతి, తపాల శాఖోద్యోగుల సంఘం), ఎస్. వి. గిరి (పంచదార కార్మికుల సంఘం), ప్రభాత్ కార్ (బ్యాంకు ఉద్యోగుల సంఘం), సభ్యులుగా వున్నారు.

కార్మికుల కోర్కెల సాధనకు అవసరమైతే లాంఛనప్రాయంగా ఒక రోజున సమ్మె చేయటానికి సిద్ధం కావాలని నేటి సమావేశంలో నిశ్చయించారు.

ఈవేళ సమావేశంలో ఆమోదించబడిన తీర్మానంలో ఇలా పేర్కొన్నారు:

"దేశం మొత్తంమీద కార్మికులందరిలోను అసంతృప్తి అంతకంతకు ఇతోధిక మవుతోంది.

ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక విధానంలోగల లోపాలే అసంతృప్తికి మూలహేతువు. కార్మికులకు సరసమైన వేతనాలు ముట్టటంలేదు. కార్మిక సంఘాలను ప్రాతినిధ్య ప్రాతిపదికపైన ప్రభుత్వం గుర్తించటంలేదు. పెరిగిన జాతీయాదాయంలో కార్మికులకు న్యాయంగా దక్కవలసిన వాటా దక్కటంలేదు. కార్మికుల ప్రాథమిక హక్కులను ప్రభుత్వం భంగపరుస్తోంది".

మార్చి 27 వ తేదీన ప్రభుత్వానికి అందజేసే "కార్మికుల కోర్కెల పత్రం"లో ఈ క్రింది కోర్కెలు ఉదహరించాలని నేటి సమావేశంలో పలువురు సభ్యులు సూచించారు.

జీతాలను నూటికి పాతిక వంతులు పెంచాలి; కరువు భత్యాన్ని మూల వేతనంతో కలిపివేయాలి; జ్యూట్, తోటలు, బొగ్గుగనులను మినహాయించి మిగతా గనులు, ఇనుము, ఉక్కు, రైల్వేలు, తంతి తపాలా, రేవు, ఇన్సూరెన్సు మున్నగు కార్మికుల వేతనాలను నిర్ణయించటానికి వేతన నిర్ణాయక సంఘాలను నియమించాలి.

వారపు సెలవులు, ప్రావిడెంటు ఫండు పథకాన్ని విస్తరింప చేయటం ప్రాతినిధ్య ప్రాతిపదికపై కార్మిక సంఘాలను ప్రభుత్వం గుర్తించటం వంటి కోర్కెలు ఆ పత్రంలో పేర్కొనబడగలవు.

# నిమ్న జాతులకు శాసన సభల్లో స్థానాలు

## గడువును పెంచే సమస్యపై లోక్‌సభలో శ్రీ దాతార్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25

నిమ్న జాతులవారికి పార్లమెంటులోనూ, రాష్ట్రశాసన సభల్లోనూ స్థానాల కేటాయింపును ఇకముందు కూడా కేటాయించాలా లేదా అన్న విషయమై ఆలోచించుకోవడానికి తగినంత వ్యవధి — 1962 వరకూ గలదని నేడు దేశ వ్యవహారాల సహాయమంత్రి శ్రీ బి. యన్. దాతార్ లోక్‌సభలోఅన్నారు.

ఆవిషయమై ఒక నిర్ణయం తీసుకొనే ముందు దానినిగురించి చర్చించేందుకు సభవారికి పూర్తి అవకాశం యివ్వబడుతుందని ఆయన వాగ్దానం చేశారు.

నిమ్న జాతులవారికి పార్లమెంటులోనూ, రాష్ట్ర శాసన సభల్లోనూ స్థానాల ప్రత్యేక కేటాయింపు రాజ్యాంగంలో పేర్కొనబడిన పదేండ్లగడువును ఇంకా పొడిగించాలని నిమ్న జాతుల కమిషనర్ అభిప్రాయం వెలిబుచ్చినట్లు పత్రికల్లో వెలువడింది. ఆ విషయమై ప్రభుత్వం తన అభిప్రాయాన్ని ప్రకటించాలని కాంగ్రెసు సభ్యుడు శ్రీ బి. యస్. మూర్తి కోరినమీదట శ్రీ దాతార్ పై విధంగా చెప్పారు.

శ్రీ దాతార్ ఇంకా మాట్లాడుతూ స్థానాలను రిజర్వుచేసే గడువును పొడిగించడానికి కమిషనర్ తన వ్యతిరేకతను వెలిబుచ్చినట్లు తాను విన్నానన్నారు.

కొండజాతుల విషయంలో మాత్రం గడువు పెంచవలసిన అవసరం గలదని తాను భావించుతున్నానన్నారు.

# ఉత్తరాఫ్రికాలో పశ్చిమ రాజ్యాల స్థానం

## పినో ప్రకటన

పారిస్, ఫిబ్రవరి 25

ఉత్తరాఫ్రికాలో ఫ్రాన్సు పలుకుబడి నశిస్తే ఆ నష్టం మొత్తం పశ్చిమ రాజ్యాలన్నింటికీ వాటిల్లుతుందని ఫ్రెంచివిదేశాంగమంత్రి క్రిస్టియన్ పినో ఫ్రెంచి ఎగువ శాసనసభలో ఫ్రెంచి ట్యునీషియా సంబంధాలపై జరిగిన చర్చ సందర్భంలో తెలిపారు.

అట్లాంటిక్ కూటమి ఐక్యత ప్రపంచంలో సర్వత్రా గోచరించినప్పుడే దానికి విలువ వుంటుందని ఆయన అన్నారు. ఈ విషయమై అమెరికాతో చెప్పామన్నారు. సూయజ్ విషయంలోనూ బాగ్దాదు కూటమి విషయంలోనూ అమెరికా చేసిన పెద్ద పొరపాట్లను గురించి కూడా చెప్పామన్నారు.

సూయజ్‌పై ఇంకా కొద్దిగంటల్లో దాడిజరుగుతుందనగా ఈ విషయాన్ని గురించి ఎంత చెవి నిల్లు కట్టుకొని పోరినా అమెరికా వినలేదన్నారు.

# అమెరికా గోధుమ రుణాలు

వాషింగ్టన్, ఫిబ్రవరి 25

అమెరికా 1951 లో గోధుమల కోసం ఇచ్చిన రుణం బకాయీని రూపాయలలో చెల్లబెట్టుకోడానికి ఒప్పుకోవలసిందిగా కోరామని ఇక్కడి భారతరాయబార కార్యాలయంవారు ప్రకటించారు.

# రైలు లూటీ

## హౌరాకు 50 మైళ్ళ దూరంలో

కలకత్తా, ఫిబ్రవరి 26

నిన్న సాయంత్రం హౌరానుండి బయలుదేరిన మొకామే ఎక్స్‌ప్రెస్‌ను దొంగల ముఠా ఒకటి ఆపి, దోచుకొన్నవార్త ఇక్కడికి అందింది.

హౌరాకు యాభైమైళ్ళ దూరంలో వున్న ఒక లెవెల్ క్రాసింగ్ వద్ద అలారం గొలుసులాగి బందిపోటు దొంగలు ఎక్స్‌ప్రెస్‌ను ఆపివేశారు. ఆతరువాత ఒక మూడో తరగతి పెట్టెలో ప్రవేశించి లూటీచేశారు.

లెవెల్ క్రాసింగ్ వద్దనున్న కాపలా మనిషి లూటీనిచూసి సమీపంలోవున్న రైల్వేస్టేషన్‌కు పరుగెత్తుకొని వెళ్ళి అక్కడి స్టేషన్ మాస్టరుకు ఈ సమాచారాన్ని అందజేశాడు. అప్పుడు ఆ స్టేషన్‌మాస్టర్ బర్ద్వాన్‌కు, హౌరాకు అర్జంటు కబురు చేయగా ఒక ట్రక్కులోనూ, ఒక గూడ్సుబండిలోనూ రైల్వేపోలీసు బలగం వచ్చింది. వారు వచ్చేలోపల దొంగలముఠా పారిపోయారు. కాని అందులో ఆరుగురిని పోలీసులు పట్టుకొని అరెస్టు చేయగలిగారు.

బాగా డబ్బుతోవున్న మనుష్యులు ఆ పెట్టెలో ప్రయాణం చేస్తున్నట్లు దొంగలకు ముందుగానే సమాచారం తెలుసునని పోలీసులు అనుమానించుతున్నారు.

# కొడైకెనాల్‌లో టి. టి. కె. మకాం

మద్రాసు, ఫిబ్రవరి 25

మాజీ ఆర్థికమంత్రి శ్రీ టి. టి. కృష్ణమాచారి మధుర జిల్లాలో వున్న కొడైకెనాల్‌లో మకాం చేయడానికి నేడురాత్రి బయలుదేరివెళ్ళారు. కొడైకెనాల్ ఆరువేల అడుగుల ఎత్తునున్న వేసవిమకాం. కొన్ని వారాలపాటుఆయన అక్కడే వుంటారట. ఆ తరువాత ఆయన స్థిరనివాసాన్ని గురించి ఒక నిర్ణయానికి వస్తారట.

# హిందీ టైప్‌రైటర్ కీబోర్డు స్థిరీకరణ

## లోక్‌సభలో మంత్రి ప్రకటన

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25

హిందీ టైప్‌రైటర్ కీబోర్డును ప్రామాణీకరం చేయడానికి నియమించబడిన కమిటీ సిఫార్సులను భారత ప్రభుత్వం ఆమోదించినదని నేడు లోక్‌సభలో ఒక ప్రశ్నకు జవాబుగా కమ్యూనికేషన్ల మంత్రి శ్రీ రాజ్ బహదూర్ తెలియజేశారు.

హిందీ టెలిప్రింటర్ కీబోర్డు విషయమై ఆ కమిటీచేసిన సిఫార్సులు ఇంకా పరిశీలనలోనే వున్నాయని ఆయనన్నారు.

ప్రామాణికంగా అంగీకరించబడిన కీబోర్డును ఆధారం చేసుకొని హిందీ టైప్‌రైటర్లను తయారుచేయించే విషయమై వాణిజ్య పరిశ్రమల మంత్రిత్వ శాఖను సంప్రతించి విద్యామంత్రిత్వ శాఖ త్వరలోనే చర్యలను తీసుకొనబోతున్నదని శ్రీ రాజబహదూర్ తెలిపారు.

# బొంబాయి రాష్ట్ర బడ్జెట్

## రెండుకోట్ల పైచిలుకు లోటు

బొంబాయి, ఫిబ్రవరి 25

బొంబాయి శాసనసభలో ఆర్థిక మంత్రి శ్రీ జీవరాజ్ మెహతా 1958 - 59 సంవత్సరపు బడ్జెట్‌ను 2 కోట్ల లక్ష రూపాయల లోటుతో ఈవేళ సమర్పించారు.

1958 - 59 సంవత్సరానికి వచ్చే రెవెన్యూ ఆదాయం రు. 120 కోట్లు కాగా, ఖర్చు రు. 122.01/- లు అని ఆయన తెల్పారు.

భారత దేశంలోని రాష్ట్ర ప్రభుత్వాల బడ్జెట్ లన్నింటిలోకి ఇదే పెద్దది.

# వేలం పాటల్లో ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొనడంపై నిషేధం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24

తమ మంత్రులుగాని, లేక డిపార్టుమెంటులుగాని ఏర్పాటు చేసే వేలం పాటలలో ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొనరాదని నిషేధిస్తూ నేడు దేశవ్యవహారాల మంత్రిత్వశాఖ ఒక సర్క్యులర్‌ను జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఏ ఉద్యోగి వేలములలో పాటపాడరాదని అందులో స్పష్టం చేయబడింది.

నసీమ్ లవెండర్ బ్రిలియన్‌టైన్
ఒత్తయిన జుత్తుకు
హమీ & కో
బొంబాయి-2

ఇళ్లకు - ఆఫీసులకు - ఆస్పత్రులకు
దివ్యముగా ఉండే
ఖీరా ఉక్కు ఫర్నిచర్‌ను
ఈ క్రిందివారివద్ద కొనండి:
మెస్సర్స్ శ్రీరామా కార్పొరేషన్
ఏలూరు రోడ్, విజయవాడ 2
Khira
ఖీరా ఫర్నిచర్‌లో కొన్ని:
క్యాబినెట్లు - ఆఫీసు డెస్కులు మరియు కుర్చీలు - ర్యాకులు - సోఫా సెట్లు - డైనింగ్ సెట్లు - ఆస్పత్రి మంచములు మరియు మంచము ప్రక్క ఉంచే లాకర్లు - కేంటీను టేబిల్సు మరియు కుర్చీలు - మడత కుర్చీలు.
ఖీరా స్టీల్ వర్క్స్ ప్రైవేట్ లిమిటెడ్
మోడ్‌బందర్ రోడ్, సాంటా క్రుజ్, బొంబాయి 23
KSW. 5900

సంపాదకవర్గం: మద్దుకూరి చంద్రశేఖరరావు (అధ్యక్షుడు); కొల్లగడ్డ రాజగోపాలరావు, ఏటుకూరు బలరామమూర్తి - ఎడిటర్, ప్రింటర్ & పబ్లిషర్: విశాలాంధ్ర విజ్ఞానసమితి తరఫున కొల్లగడ్డ రాజగోపాలరావు, స్వతంత్ర ఆర్ట్ ప్రింటర్స్, విజయవాడ - 2.